జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 6 సంచిక 345 | హైదరాబాద్, మార్చి 07 మంగళవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00



# నేను కరవమన్నానా..?

## ఎవరినో కుక్క కరిస్తే.. నేనే కరవమన్నట్లు చేశారు: జీహెచ్ఎంసీ విజయలక్ష్మి

హైదరాబాద్: అంబర్‌పేటలో వీధికుక్కల దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి తెలుగు రాష్ట్రాల సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే వీధి కుక్కలు ఆకలి వేయడంతోనే ఈ దాడి చేశాయంటూ జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అయితే అపఖ్యాతి పాలైనప్పటికీ ఆమె వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. మరోసారి ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనపై విమర్శలపై మేయర్ విజయలక్ష్మి స్పందిస్తూ... హైదరాబాద్‌లో ఎవరినో కుక్క కరిస్తే.. తానే కరవమన్నట్లు చేశారని అన్నారు. 'నేనేమైనా కరవమన్నానా' అనే రీతిలో వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ మేయర్‌గా ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తున్నానని, కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. రాజకీయాల్లో మహిళల గురించి ఎప్పుడూ చెడుగా మాట్లాడతారని, మహిళలు బయటకు వస్తే ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వాలంటూ ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు చాలాసార్లు చెప్పానని విజయలక్ష్మి అన్నారు.

**విమర్శలపాలైనా వైఖరి మారలేదు...**

అంబర్‌పేట్‌లో బాలుడి మృతిపై జీహెచ్ఎంసీ (మిగతా 2లో..)

# ముఖ్యమంత్రి కేసీఆర్ హోలీ శుభాకాంక్షలు



హైదరాబాద్: హోలీ పర్వదినం సందర్భంగా సీఎం కేసీఆర్ దేశ, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వసంత రుతువుకు నాందీ ప్రస్తావనగా, పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకుని, వినూత్నంగా పున:ప్రారంభమయ్యే ప్రకృతి కాలచక్రానికి హోలీ పండుగ స్వాగతం పలుకుతుందని సిఎం కేసీఆర్ అన్నారు. చిగురించే ఆశలతో తమ జీవితాల్లోకి నూతనత్వాన్ని హోలీరూపంలో స్వాగతం పలికే భారతీయ సాంప్రదాయం రమణీయమైనదన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలందరికీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హోలీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. హోలి పండుగ నేపథ్యంలో పల్లెలన్నీ వెన్నెల నవరాత్రుల్లో సాగే చిన్నారుల జాజిరి ఆటా పాటలతో, కోలాటాల చప్పుల్లతో ఉత్తేజం వెల్లివిరుస్తుందని సీఎం తెలిపారు. పిల్లా పెద్దా తేడా లేకుండా సింగిడి రంగుల నడుమ ఖేలీ కేరింతలతో సాగే హోలీ, మానవ జీవితమే ఒక వేడుక అనే భావనను, ప్రకృతితో మమేకమై జీవించాలనే తత్వాన్ని మనకందిస్తుందన్నారు. బేధభావాలను వీడి పరస్పర ప్రేమాభిమానాలను చాటుకుంటూ ప్రజలందరూ మోదుగుపూల వంటి సహజసిద్దమైన రంగులతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సిఎం సూచించారు. స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి కార్యాచరణ, తెలంగాణలోని దళిత బహుజన, సకల జనుల జీవితాల్లో నిత్య వసంతాన్ని నింపిందని సిఎం తెలిపారు. దేశ ప్రజలందరి జీవితాల్లో నూతనోత్తేజం వెల్లివిరిసేదాకా తమ కృషి కొనసాగుతూనే వుంటుందని సిఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

# మార్చి 26 న రాజ్యాధికారం అనే అంశం పై 100 కులాల నాయకులతో

# పార్స్ ఆధ్వర్యంలో ఒకరోజు సదస్సు...

## ప్రతీ పౌరుడికి రాజ్యాధికారం దక్కడమే పార్స్ లక్ష్యం...

## వ్యక్తులు శాశ్వతం కాదు...

## బహుజన రాజ్యాధికారం సాధించడమే పార్స్ అంతిమ లక్ష్యం...

## ప్రజాపాలనతో పార్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ తట్టి అర్జున్ రావు...



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):దేశంలో అధిక సంఖ్యాకులైన బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే ఏకైక లక్ష్యంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్) పనిచేస్తుందని,కులాల ఐక్యత కోసం 100 కులాల నాయకుల తోటి రాజ్యాధికారం అనే అంశం పై పార్స్ ఆధ్వర్యంలో ఈ నెల 26 న విజయవాడలో ఒకరోజు సదస్సు ను నిర్వహించనున్నట్లు పార్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ తట్టి అర్జున్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ బిసి,ఎస్ సి, ఎస్ టి, మైనార్టీ కులాలకు సరైన ప్రాతినిధ్యం నేటికీ కరువైందని, చట్ట సభలలో తమ తరపున ఒక్క సభ్యుడు కూడా ప్రాతినిధ్యం వహించని కులాలు ఎన్నో ఉన్నాయన్నారు. పార్స్ అధికారంలోకి రావడంతోనే అన్ని కులాల వారికి సమ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వ్యక్తులు శాశ్వతం కాదని, నేను వెళ్ళిపోతే ఉద్యమం ఆగిపోతుందని ఎవరైనా అనుకుంటే అది వారి అమాయకత్వమే అవుతుందని, పార్స్ లోకి కొందరు వస్తారు కొందరు వెళతారు మా పార్స్ సిద్ధాంతాలు నచ్చిన వాళ్ళు ఉంటారు నచ్చని వాళ్ళు వెళ్ళిపోతారు . పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఒక మహా సంకల్పంతో స్థాపించినటువంటి సంస్థ బహుజన రాజ్యాధికారం సాధించడమే దీని అంతిమలక్ష్యం గా బహుజనులంతా ఒక ఉద్యమంలా ముందుకు రావాలన్నారు. బహుజనులందరిని ఏకతాటి పైకి తెచ్చి దేశ భవితవ్యం బహుజనులదే అని చేసి చూపించడమే పార్స్ ఆశయం అని తెలిపారు. ఇప్పటికే మండలం, జిల్లా, నియోజకవర్గం వారీగా కమిటీ లను ఏర్పాటు చేసి ఆ కమిటీ లలో ప్రతీ ఏడు కులాల వారికి ప్రాతినిధ్యం వహించేలా చేస్తూ అందరిని నాయకులుగా పార్స్ తయారు చేస్తుందన్నారు. ప్రతీ ఒక్క పనిలో మహిళలకు సముచిత స్థానం కల్పించేలా పార్స్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా 26 న జరగనున్న సదస్సులో బహుజనులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తట్టి అర్జున్ రావు పిలుపునిచ్చారు.



# ట్రాఫిక్ సమస్యలకు చెక్




హైదరాబాద్ : ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు మహానగరంలో రహదారుల అభివృద్ధి వ్యూహాత్మకంగా సాగుతోంది. ఇప్పటికే పలు ప్రధాన ప్రాంతాలు, కూడళ్లలో సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం అందుబాటులోకి రాగా.. మరికొన్ని చోట్లా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా పూర్తవు తున్నాయి. వంతెనలు, అండర్‌పాసలతో ఆయా ప్రాంతాల్లో రూపు రేఖలు మారుతున్నాయి.

ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద..

ఇప్పటికే ఓ , అండర్‌పాస్ అందుబాటులోకి వచ్చిన ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద కుడివైపు వంతెన సిద్ధమైంది. త్వరలో ప్రారంభోత్సవం ఉంటుందని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఈ ఫ్లైఓవర్ ఎప్పుడో అందుబాటులోకి రావాల్సి ఉన్నా.. ఆలయానికి సంబంధించిన స్థల సేకరణ, ఇతరత్రా కారణాలతో జాప్యం జరిగింది. స్థల సేకరణ కుదరకపోవడంతో ఉన్నంతలో రహదారిని అందుబాటులోకి తీసుకువచ్చారు. రూ.32 కోట్లతో 960 మీటర్ల మేర హయత్‌నగర్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వైపు వచ్చేలా వంతెన నిర్మించారు.

31 ప్రాజెక్టులు పూర్తి...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిగ్నల్ చిక్కులకు చెక్‌పెట్టేలా వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రూ.8వేల కోట్లతో 42 ప్రాంతాల్లో పనులు చేపట్టారు. ఇందులో 18 వంతెనలు, ఐదు అండర్‌పాసలు, ఎనిమిది చోట్ల ఆర్‌ఓబీ/ఆర్‌యూబీలు కలిపి మొత్తం 31 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఐటీ రంగానికి కేంద్ర బిందువైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు ఎక్కువగా చేపట్టారు. బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద రెండు లెవల్స్‌లో ఫ్లైఓవర్లు, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద వంతెన, అండర్‌పాస్, అంతర్జాతీయ విమానాశ్రయానికి సులువైన రాకపోకల కోసం గచ్చిబౌలి వంతెన మీదుగా శిల్ప లేఅవుట్, కొండాపూర్, కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీ చౌరస్తాల్లో వంతెనలు, అయ్యప్ప సొసైటీ వద్ద (మిగతా 2లో..)

# మహిళల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా 'ఆరోగ్య మహిళ'

## డియం అండ్ హెచ్ ఓ .జిసి సుబ్బారాయుడు


**( అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం 'మహిళల ఆరోగ్యం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళ ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. జిల్లాలోని జిన్నారం, కుందారము, తాళ్ళగురిజాల, మంచిర్యాల లోని బస్తీ దవాఖానాలలో ఈనెల 8నుంచి మహిళల లకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో కి రానున్నాయి. )**



మంచిర్యాల బ్యూరో, మార్చి 06, ప్రజాపాలన:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని,ఈ నెల 8నుంచి మహిళల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా 'ఆరోగ్య మహిళను అమలు చేయనుందని డియంఅండ్ హెచ్ ఒ జిసి సుబ్బారాయుడు తెలిపారు. (మిగతా 2లో..)

# నిమ్స్ ఆస్పత్రి జాతీయ రికార్డు..

**ఒకే నెలలో 15 కిడ్నీ మార్పిడి సర్జరీలు**
**దేశంలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరికొత్త చరిత్ర**
**ఆరోగ్య శ్రీ కింద పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్సలు**
**నిమ్స్ వైద్య బృందానికి మంత్రి హరీశ్‌రావు అభినందన**




హైదరాబాద్ : హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి జాతీయ రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరిలో 15 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించింది. దేశంలో ఒకే నెలలో అత్యధిక కిడ్నీ మార్పిడులు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిగా జాతీయ రికార్డు సాధించింది నిమ్స్. ఈ సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు నిమ్స్ యూరాలజీ విభాగాన్ని అభినందించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అవయవ మార్పిడి సర్జరీలను ఖర్చుకు వెనుకాడకుండా ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిమ్స్ యూరాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్ దేవరాజ్ నేతృత్వంలో డాక్టర్ సీహెచ్ రామ్ రెడ్డి, డాక్టర్ ఎస్ విద్యాసాగర్, (మిగతా 2లో..)



# నేను కరవమన్నానా..?

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల పనితీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. బాలుడి మృతి నేపథ్యంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో మేయర్ విజయలక్ష్మి అత్యవసర సమీక్ష నిర్వహించారు. బాలుడి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. బాలుడిని చంపిన కుక్కలకు ప్రతిరోజూ ఓ మహిళ మాంసం పెడుతుండేదని, ఆమె 2 రోజులుగా కనిపించకపోవడంతో ఆకలితో కుక్కలు దాడి చేసి ఉండొచ్చంటూ ఆమె సందేహం వెలిబుచ్చారు. దీంతో మేయర్‌ను టార్గెట్‌గా అన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. ఇప్పటికీ ఆ వ్యాఖ్యల వేడి తగ్గలేదు. కాగా అంబర్‌పేటలో బాలుడిపై కుక్కలు మూక్కుమ్మడిగా దాడి చేస్తున్న దృశ్యాలు చూసి ప్రతీ ఒక్కరూ కంటతడిపెట్టారు. ఈ క్రమంలో వీధికుక్కల దాడిని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. వీధి కుక్కల దాడులు, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై గైడ్ లైన్స్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల పరిధిలో చర్యలకు ఆదేశించింది. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా నియంత్రించాలని... కుక్కలకు 100 శాతం స్టెరిలైజేషన్ చేయాలని పేర్కొంది. మాంసం దుకాణాలు, ఫంక్షన్ హాళ్ల వారు మాంసాహారాన్ని ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కుక్కలను పట్టుకునే బృందాలు, వాహనాల సంఖ్యను పెంచాలని తెలిపింది. వీధి కుక్కలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించాలని... అలాగే వీధి కుక్కలపై స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొంది. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేయాలని చెబుతూ.. జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ జీహెచ్ఎంసీ మేయర్‌గా ఉన్న విజయలక్ష్మిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం గమనార్హం.

# నిమ్స్ ఆస్పత్రి జాతీయ రికార్డు..

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ జీ రామచంద్రయ్య, డాక్టర్ జీవీ చరణ్ కుమార్, డాక్టర్ ఎస్ఎస్ఎస్ ధీరజ్‌తో కూడిన బృందం ఈ సర్జరీలను విజయవంతంగా నిర్వహించింది. డాక్టర్ పద్మజ, డాక్టర్ జే నిర్మల నేతృత్వంలోని అనస్థీషియా విభాగం, డాక్టర్ టీ గంగాధర్, డాక్టర్ భూషణ్ రాజ్ నేతృత్వంలోని నెఫ్రాలజీ విభాగం వారికి సహకరించారు.

**మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ఫ్లాంట్ సెంటర్‌గా నిమ్స్**

తెలంగాణ ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టారు. భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఆసుపత్రిలో అత్యాధునిక వసతులు సమకూరాయి. నిమ్స్ ఆస్పత్రి మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌గా మారింది. ఇక్కడ కిడ్నీతోపాటు కాలేయం(లివర్), గుండె (హార్ట్), ఊపిరితిత్తులు (లంగ్) మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. అవయవ మార్పిడులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వరకు కేటాయిస్తూ, పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నది. అంతేకాకుండా రోగులకు జీవితాంతం అవసరమయ్యే మందులను ఉచితంగా అంజేస్తున్నది. ప్రభుత్వ ప్రోత్సాహంతో విజవంతంగా సర్జరీలు చేస్తున్నట్లు డాక్టర్ రాహుల్ దేవరాజ్, యురాలజి విభాగం హెచ్‌వోడీ తెలిపారు.నిమ్స్‌లో 2014 నుంచి ఇప్పటివరకు 839 కిడ్నీ మార్పిడులు జరిగాయి. ఇందులో 509 లైవ్ ట్రాన్స్‌ప్లాంట్ కాగా, 330 కెడవర్ నుంచి సేకరించినవి. 25 కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహించారు. ఇందులో 11 లైవ్, 14 కెడవర్ ఉన్నాయి.10 గుండె మార్పిడి సర్జరీలను విజయవంతంగా నిర్వహించారు.ఒకరికి ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీ జరిగింది.

**వైద్యబృందానికి అభినందనలు : వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు**

నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో, నిమ్స్ యూరాలజీ విభాగం ఒకే నెలలో 15 కిడ్నీ మార్పిడి సర్జరీలు విజయవంతంగా నిర్వహించి జాతీయ రికార్డు సృష్టించడం, పేషంట్లందరూ ఆరోగ్యంగా ఉండటం మంచి విషయం అని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవయవ మార్పిడి శస్త్రచికిత్సలన్నీ ఆరోగ్య శ్రీ పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ఈ సర్జరీల్లో భాగస్వాములైన వైద్యబృందం, జీవన్ దాన్ కోఆర్డినేటర్ స్వర్ణలతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ట్రాఫిక్ సమస్యలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

అండర్‌పాస్ వినియోగంలోకి వచ్చాయి. ఐటీ కారిడార్ అనంతరం ఎక్కువగా ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్ట్‌లు ఎల్‌బీనగర్‌లో చేపట్టారు. నాగోల్, కామినేని వద్ద కుడి, ఎడమ వైపు వంతెనలు, ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద ఓ వంతెన, అండర్‌పాస్, బైరామల్‌గూడ చౌరస్తా వద్ద ఎడమ, కుడి వైపు ఫ్లైఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఎల్‌బీనగర్ చౌరస్తాలో మరో వంతెన ఇప్పుడు సిద్ధమైంది.

సీటీఎస్ ఆధారంగా...

2030 వరకు పెరగనున్న వాహనాలు, తదనుగుణంగా రహదారులు, ప్రజారవాణా వ్యవస్థ ఎలా మెరుగుపర్చాలన్నది అంచనా వేస్తూ సమగ్ర రవాణా అధ్యయన నివేదిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రతిపాదించినవే ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు. నగరంలో రహదారుల విస్తరణకు బదులు వంతెనల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అన్ని ప్రాంతాల్లో రూ.30వేల కోట్లతో వంతెనలు, అండర్‌పాసలు, ఆర్ఓబీ/ ఆర్‌యూబీలు చేపట్టాలని భావిస్తున్నారు. ఈ పనులను దశల వారీగా చేపట్టాలని నిర్ణయించారు. మొదటి విడత పనులు తుది దశకు చేరిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఇప్పటికే రెండో ఫేజ్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రతిపాదనలను ప్రభుత్వానికి కూడా పంపారు.

# మహిళల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా 'ఆరోగ్య మహిళ'

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం జిల్లా కేంద్రంలో ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య మహిళల కార్యక్రమం కోసం క్షేత్రస్థాయిలో అధికారుల కు ఇప్పటికే తగిన మార్గదర్శకాలను జారీ అయ్యాయని అన్నారు. వచ్చే బుధవారం నుంచి ఇది లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, అక్కడ ఆరోగ్య మహిళ క్లీనిక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ మంగళవారం పీహెచ్సీ పనివేళల్లో మహిళల ఆరోగ్య పరిశీలన, వివిధ రకాల వ్యాధుల నిర్ధరణ పరీక్షలు చేసి, మధుమేహం, రక్తపోటు వంటివే కాకుండా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ చేయడం జరిగిందని తెలిపారు. థైరాయిడ్, అయొడిన్ లోపం, రక్తహీనత వంటి సమస్యలతో బాధపడేవారిని గుర్తించనున్నారు. మెనోపాజ్, మూత్రకోశ సమస్యలు, థైరాయిడ్, రక్తహీనత వంటి సమస్యలతో బాధపడేవారిని గుర్తించి, పరీక్షలు జరిపి అవసరమైన సూచనలు, సలహాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అధిక బరువు, మానసికఇబ్బందులున్న వారికి తగిన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**మహిళా వైద్యులు, సిబ్బంది చే పరీక్షలు**

వాస్తవానికి ఆరోగ్య పరిక్షలు సాధారణ ఆసుపత్రుల్లోనూ చేసే అవకాశం ఉన్నాప్పటికి జనరల్ ఓపీ కారణంగా అందరూ స్వేచ్ఛగా తమ సమస్యలు చెప్పుకొనే వీలుండదు కాబట్టి నూతనకార్యక్రమంతో ఆ ఇబ్బంది దూరమవుతుందని ఆయన పేర్కొన్నారు. కేవలం మహిళా వైద్యులు, సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండటం వల్ల ఎలాంటి బెరకు, అపోహల్లేకుండా తమ ఆరోగ్య సమస్యలు చర్చించుకుని అవసరమైన సూచనలు, చికిత్స పొందడానికి సులభమవుతుందన్నారు.ఎంపికైన కేంద్రంలో ఇద్దరు మహిళా వైద్యులు, ఇద్దరు నర్సులు అందుబాటులో ఉంటారని , జిల్లా ఆసుపత్రి నుంచి ఓ గైనకాలజిస్టు, స్టాఫ్ నర్సును సైతం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వీరికి ఇప్పటికే తగిన శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆసుపత్రికి వచ్చే మహిళలతో మాట్లాడటం, వారిలోని భయం పోగొట్టి ఆరోగ్య సలహాలు, సూచనలు అందజేయడం వీరి విధి గా పనిచేస్తారని తెలిపారు. వైద్యపరీక్షలు చేశాక వివరాలను ఆరోగ్య మహిళ యాప్ లో నమోదుచేస్తారని, అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాన్,డిఇయంఒ బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉగ్రమూలాలపై ముప్పేట దాడి

శ్రీనగర్, మార్చి 6,:పాకిస్తాన్ దివాలా తీసింది. పాక్ అండదండలతో చెలరేగిపోయి భారత్‌పై దాడులకు తెగబడే ఉగ్రమూకలు ఇప్పుడు సాయమందక దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఇదే మంచి సమయం అని భావిస్తున్న భారత ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టింది. పాకిస్థాన్‌లో ఉంటూ భారత్‌లో ఆరాచకం సృష్టిస్తున్న ఉగ్రవాదులకు కళ్లెం వేసే పని చేపట్టింది కేంద్ర ప్రభుత్వం. కశ్మీర్‌కు చెందిన కొందరు ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో కూర్చొని భారతదేశంలో అరాచకాలు సృష్టిస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు 168 మంది ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది.ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని రోజువారీ ఖర్చులకు పాకిస్తాన్ తల్లడిల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉగ్రమూకలకు ఆర్థిక సాయం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఉగ్రవాద నాయకులకు తమ శిక్షణా కేంద్రాలు నడిపించేందుకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. పాక్ నుంచి వచ్చే డబ్బుతో వారు



ఇన్నాళ్లు ఇండియాలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో పాక్‌లో తిష్టవేసిన తీవ్రవాద నాయకులు కశ్మీర్‌లో ఉన్న తమ ఆస్తులు అమ్మాలనే ఒత్తిడి పెరుగుతోంది. ఆ డబ్బుతో కొన్నాళ్ల పాటు మనుగడ సాగించాలన్నది ఈ తీవ్రవాద నేతల ఆలోచన.కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ, ఎన్ఐయేవంటి ఏజెన్సీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఉగ్రవాదులకు నిధులు అందే మార్గాలను దాదాపు మూసేశాయి. తాజాగా ఈ విధానంలో కొంత మార్పు చేస్తూ ఉగ్రవాదులకు చెందిన ఆస్తుల జప్తుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 90వ దశకం నుంచి పరారీలో ఉన్న ఉగ్రవాదులపై కేంద్రం చర్యలకు ఉపక్రమించి చాలా కాలమవుతోంది. వీరందరిని యూఏపీయే చట్టం కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. దాన్ని కొనసాగింపుగా ఇప్పుడు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలకు దిగుతున్నట్టు స్పష్టమవుతోంది.ఇలా ప్రకటించిన ఉగ్రవాదుల పేర్లతో ఉన్న ఆస్తులను జప్తు చేస్తున్నారు. అలాగే వారు అక్రమంగా ఏదైనా ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్టు అయితే వాటిని బుల్‌డోజ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ గతేడాది డిసెంబర్ 31న మొదలైంది. దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ పహాల్‌గావ్ పరిధిలోని లీవర్ గ్రామానికి చెందిన కరుడుగట్టి ఉగ్రవాది గులాంనబీ ఖాన్ అలియాస్ అమీర్ ఖాన్ ఆస్తుల జప్తుతో ఈ ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది.మార్చి మొదటి వారంలో ఈ చర్యలను కేంద్రం మరిన్ని కఠిన చర్యలు చేపట్టింది. ఉగ్రవాద సంస్థ అల్ ఉమర్ సంస్థ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్‌కు శ్రీనగర్‌లో ఉన్న ఆస్తులను ఎన్ఐయే స్వాధీనం చేసుకుంది. ఆ ఆస్తులు తమ అధీనంలో ఉన్నాయని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసింది. అలాగే బారాముల్లాకు చెందిన బాసిత్ రేషికి చెందిన ఆస్తులను కూడా ఎన్ఐయే జప్తు చేసింది. ఈ ఇద్దరు కూడా ప్రస్తుతం పాక్‌లో తలదాచుకుంటున్న భారత్‌కు చెందిన ఉగ్రవాదులే. హిజ్బుల్ ముజాహిద్దున్ సుప్రీమ్ సయ్యద్ సలావుద్దీన్ వంటి ప్రముఖ ఉగ్రవాదుల విషయంలోనూ ఈ తరహా చర్యలు చేపట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇలాంటి చర్య ఎప్పుడో చేపట్టాల్సిందని కశ్మీర్ సొసైటీ సంఘటన్ వంటి సంస్థలు అంటున్నాయి. ఆస్తుల యజమానుల్లో చాలా మంది 1947లోనే పాక్‌కు పారిపోయిన విషయాన్ని గుర్తు చేస్తోంది. ఈ తరహా ఉగ్రవాదుల సంఖ్య 168 వరకు ఉంటుందని జమ్ము కశ్మీర్ పోలీసులు చెప్తున్నారు. వీళ్లంతా పాక్‌కు పారిపోయి అక్కడి నుంచి ఇక్కడ అరాచకం సృష్టిస్తున్నారని అంటున్నారు. అలాంటి వారందరి సంపదను జప్తు చేసే ప్రక్రియ ఇప్పుడు మొదలుకాబోతోంది. మరో వైపు, ఏదో ఒక వంక చూపుతూ ఆస్తులు స్వాధీనం చేసుకోవడం ఒక ప్రమాదకరమైన ధోరణి అని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ ఆరోపించింది. వివిధ ఏజెన్సీలు జప్తు చేస్తున్న ఆస్తులు చాలా వరకు నివాస గృహాలు ఉన్నాయని తెలిపింది.

# సిక్స్ ప్యాక్ కోసం స్టెరాయిడ్స్



హైదరాబాద్, మార్చి 6, :వారి టార్గెట్ యూత్..! అందులోనూ జిమ్ కు వెళ్లే వారు మాత్రమే..! తక్కువ సమయంలో కండలు తిరిగిన శరీరాకృతిని పొందవచ్చు అంటూ లైన్ లోకి దింపేలా ప్లాన్ చేస్తారు. ఇందుకోసం కొన్ని ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్స్ అందజేస్తుంటారు. ఇలా ఎంతో మంది యువకులకు సరఫరా చేస్తూ... జేబులు నింపుకుంటున్నారు. వీరి సరికొత్త దందా గురించి సమాచారం అందుకున్న హైదరాబాద్ పోలీసులు... ముఠా గుట్టురట్టు చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేయటంతో పాటు ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్స్, స్టెరాయిడ్స్ ను భారీగా స్వాధనం చేసుకున్నారు.అమీర్‌పేటకు చెందిన ఓం ప్రకాష్ అనే వ్యక్తి సప్లమెంటరీ ప్రోటీన్ వ్యాపారం చేస్తున్నాడు. వీటిని నరేష్ (38) అనే వ్యక్తి సరఫరా చేస్తుంటాడు. అయితే విశాఖపట్నానికి చెందిన ఓం ప్రకాష్ ప్రస్తుతం సనత్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతను హైదరాబాదులోని కుకట్‌పల్లిలో గతంలో ఫ్రీ లాన్సింగ్ జిమ్ ట్రైనర్‌గా పని చేశాడు. ఇతను గతంలో అమీర్‌పేటలో మజిల్ హౌస్ న్యూట్రిషన్ సప్లమెంటరీ ప్రోటీన్ పేరుతో బిజినెస్ కూడా చేశాడు. అయితే వ్యాపారంలో వచ్చే డబ్బులు తన జల్సాలకు సరిపోవటం లేదని.. సింపుల్ గా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం మాస్టర్ స్కెట్ వేశాడు. హార్మోన్ ఇంజెక్షన్లు, టాబ్లెట్లకు మార్కెట్లో డిమాండ్ ఉందని తెలుసుకుని.. వాటిని అవసరమైన కస్టమర్లకు ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా అధిక ధరకు విక్రయించి సులభంగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలోనే ప్రధాన నిందితుడు ఓం ప్రకాష్ ఫార్మసీ వ్యాపారంలో ఉన్న విశాఖపట్నంకి చెందిన అవినాష్ అనే చిన్ననాటి స్నేహితున్ని కలిశాడు. తన ప్లాన్ గురించి వివరించాడు. అందుకు అవినాష్ అంగీకరింటంతో.. ఈ ఇద్దరు కలిసి హార్మోన్స్ ఇంజెక్షన్లు, టాబ్లెట్లను అక్రమంగా సరఫరా చేసి అధిక మొత్తంలో లాభాలు పొందుతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన నిందితుడు ఓం ప్రకాష్ నగరంలోని జిమ్ములకు సప్లమెంటరీ ప్రోటీన్లను పంపిణీ చేసే నరేశ్, బేగంబజార్‌లో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఫారుక్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంలో ఓం ప్రకాష్ ఆ ఇద్దరితో ఇంజెక్షన్లు, టాబ్లెట్ల గురించి చర్చించాడు. ఆ ఇద్దరు కూడా అంగీకరించారు. సరఫరా చేయడం షూరూ చేశారు. వీరి దందాపై సమాచారం అందుకున్న ఎస్సాఆర్ నగర్ పోలీసులు.... సోదాలు చేపట్టారు. నగరంలో 80కిపైగా జిమ్ లకు సంబంధించి వీరికి కాంటాక్టులున్నట్లు తెలుస్తోంది.ఈ కేసుకు సంబంధించి మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేశారు. విశాఖపట్నానికి చెందిన అవినాష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు రకాల ఇంజెక్షన్లు, మాత్రలనుస్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే ఈ కేసులో ఇంకెంతమంది ఉన్నారు..? నగరంలోని జిమ్ సెంటర్ల పాత్ర ఏమైనా ఉందా..? వంటి కోణాల్లో కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఇలాంటి ఇంజెక్షన్లు, మాత్రలను తీసుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. వీటి ఫలితంగా ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా గుండె సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటికి దూరంగా ఉండాలని సూచించారు.

# ఖాళీ అవుతున్న మిడ్‌మానేరు



వరంగల్, మార్చి 6, :ఇటీవల సీఎం కేసీఆర్ ప్రారంభించిన మల్లన్న సాగర్‌కు నిరంతరాయంగా నీళ్లు ఎత్తిపోస్తుండడంతో మిడ్?మానేరు క్రమంగా ఖాళీ అవుతోంది. దీంతో అందులో మునిగిన పాత ఊళ్లన్నీ ఒక్కొక్కటే బయటపడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మిడ్?మానేరు నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్, తడ్కపల్లి పంపుహౌస్‌ల ద్వారా మల్లన్నసాగర్‌కు 13 టీఎంసీల వాటర్ ?ఎత్తిపోశారు. 50 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఈ రిజర్వాయర్? మొదటిసారి పూర్తిస్థాయిలో నింపాల్సి ఉంటుందని, ఇందుకు కనీసం రెండేళ్లు పట్టే అవకాశముందని ఇంజినీర్లు చెబుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మిడ్?మానేరు ప్రాజెక్టు కెపాసిటీ 27.5 టీఎంసీలు. కొద్దిరోజులుగా ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్?కు నీటిని విడుదల చేస్తుండటంతో మిడ్ మానేరులో నీటి నిల్వ క్రమంగా తగ్గుతోంది. దీంతో రిజర్వాయర్?లోని వరదవెల్లి, కొదురుపాక, నీలోజిపల్లి తదితర గ్రామాలు తేలుతున్నాయి. రోడ్లు కూడా క్లియర్?గా కనిపిస్తుండడంతో నిర్వాసితులు వారి గ్రామాల్లో కొద్దిసేపు గడిపి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. కొందరు ఇండ్ల గోడలపైకి ఎక్కి ఉద్వేగానికి లోనవుతున్నారు. మిడ్?మానేరులో నీళ్లు తగ్గిపోతుండడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్?మానేరుకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది మేడారం లిఫ్ట్ ద్వారా 6 టీఎంసీలు లిఫ్ట్ చేశారు. మరో 3 టీఎంసీలు తరలించనున్నట్టు ఆఫీసర్లు చెబుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఫుల్ కెపాసిటీ 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 12 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నీటి మట్టం మరింత తగ్గితే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి లిఫ్ట్ చేసేందుకు ప్లాన్? చేస్తున్నారు. మిడ్ మానేరులో మా ఊరు నీలోజిపల్లి మునిగిపోయింది. ప్రాజెక్టు నిండా నీళ్లు ఉండడంతో ఇన్నాళ్లూ మా గ్రామాన్ని చూడలేకపోయాం. కొన్ని రోజులుగా ప్రాజెక్టు నుంచి నీటిని మల్లన్నసాగర్?కు పంపుతుండడంతో పాత గ్రామం తేలింది. దీంతో ఊరు చూసేందుకు వచ్చినం. మొండి గోడలు చూస్తే కన్నీళ్లు ఆగుతలేవు. ఉన్న ఊరును, కట్టిన ఇండ్లను వదిలేసి వెళ్లిన మాలాంటి వాళ్లకు ప్రభుత్వం ఎంత చేసినా తక్కువే.మిడ్ మానేరు ప్రాజెక్టులో మా ఊరితోపాటు చాలా గ్రామాలు మునిగిపోయాయి. నీళ్లు తగ్గడంతో మా ఊరు క్రమంగా తేలుతోంది. దీంతో పాత గ్రామాన్ని చూసేందుకు వచ్చినం. ఆ దృశ్యాలు చూస్తుంటే పాత జ్ఞాపకాలతో ఆనందం, బాధ ఒకేసారి కలుగుతున్నాయని చెబుతున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**మండల పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ**



బోనకల్, మార్చి 6 ప్రజా పాలన ప్రతినిధి: మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్, ఐకెపి శాఖలతో పాటు మహిళా ఉద్యోగులందరికీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర సివిల్ కోర్టు నుండి న్యాయ సలహాదారు హాజరై న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో ఇంకొన్ని ప్రాంతాలలో మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బోడెపూడి వేణుమాధవ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, స్నేహాంజలి మండల సమైక్య ఏపిఎం పద్మలత, ఏపీవో బసవోజు కృష్ణకుమారి, ఐసిడిఎస్ సిడిపిఓ, అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి,మండల సమైక్య అధ్యక్షురాలు సోనీ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలి



ఆసిఫాబాద్ మార్చి 06, ప్రజాపాలన: మొహమ్మద్ ప్రవక్త లోకానికి శాంతి సందేశం ఇచ్చారని దానిని అమలు చేస్తూ ముందుకు సాగాలని ముఫ్తి సాదిక్ ఉల్ ఇస్లాం సూచించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని బజార్ వాడి చౌరస్తా వద్ద ఇమామ్ ఏ అజమ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాతేయా మెహఫిల్ సభ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మొహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని సేవ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మొహమ్మద్ ప్రవక్త చెప్పిన శాంతి మార్గం అనుసరించడంతోనే సమాజంలో మంచి జరుగుతుందని తెలిపారు. అనంతరం మైనారిటీ నాయకులు ముఫ్తి సాదిక్ ఉల్ ఇస్లాం ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షబ్బీర్, సయ్యద్ నిసార్, అబ్దుల్ రహమాన్ (జర్నలిస్ట్) అహ్మద్ బీన్ అబ్దుల్లా, సాజిద్, ఉబెద్ బీన్ యాహియ, ఇఫ్తేఖర్ , షాకిర్, తాజ్, ఇమ్రాన్, జమిల్, ఖైఫ్, రహమాన్, అమన్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ముందస్తు హోళీ వేడుకలు



జన్నారం, మార్చ్ 06, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు హోలీ పండుగ జరుపుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని మంగళవారం ప్రభుత్వ తరపున సెలవు దినం కావడంతో ముందస్తు హోలీ జరుపుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలమడుగు ప్రిన్సిపాల్ సతీష్ గేట్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి రాఘవేంద్ర హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ లు ముందస్తుగా విద్యార్థులతో హోలీ పండగ జరిపించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఒకరికి ఒకరు రంగు చల్లుకొని ఆనందం వెల్లువెత్తుకున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: డి టి ఓ గంధం లక్ష్మి



ఆసిఫాబాద్ జిల్లా మార్చి 6 (ప్రజాపాలన,ప్రతినిధి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రవాణా అధికారిని గంధం లక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడి ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిఎం శ్రీధర్, డీటీవో ఏవో అరుణ, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్, ఎంఎఫ్ మధుసూదన్, సూపరిండెంట్ ప్రసన్నకుమార్, వేణు, సెక్యూరిటీ సిబ్బంది, మహిళ కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్లూరు తండాలో సిసి రోడ్ల నిర్మాణం

### 10 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులు మంజూరు
### గత 60 సంవత్సరాల నిర్లక్ష్యానికి గురైన తండా
### పట్లూరు సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : గ్రామం అభివృద్ధి చెందాలంటే స్థానిక సర్పంచ్ ప్రత్యేక చొరవ అత్యంతావశ్యకం. అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన పట్లూరు తండాను వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, చెవెళ్ళ ఎంపి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి సహకారం మరువలేనిదని సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్ కొనియాడారు. పట్లూరు తండా అభివృద్ధికి 20 లక్షల నిధులు మంజురు చేయించుకున్న ఘనత పట్లూరు సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్ కృషి అభినందనీయం. నిర్లక్ష్యానికి గురైన పట్లూరు తండా అభివృద్ధికి అహర్నిశలు ఆలోచించే వ్యక్తి పట్లూరు సర్పంచ్ ఇందిర అశోక్. సర్పంచుగా ఎన్నికైనప్పటి నుండి పట్లూరు తండా అభివృద్ధికి పక్కా ప్రణాళికలను ఏర్పరుచుకున్నారు. అభివృద్ధికి ఆలోచనలు కార్యరూపం దాల్చాలనే లక్ష్యంతో ఒక్కొక్క పనిని ఎవరి ద్వారా పరిష్కారం అవుతుందోనని ఆలోచించిన వ్యక్తే గ్రామ సర్పంచ్ భర్త దేవరదేశి ఇందిర అశోక్. అందులో భాగంగానే సోమవారం పట్లూరు తండాలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టారు. పట్లూరు గ్రామానికి అనుబంధ గ్రామమైనా ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యానికి గురిచేయకుండా అభివృద్ధి బాట పట్టించడమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నారు సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ పనులు పర్యవేక్షించారు. ఎఈ శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష వికారాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మెతుకు ఆనంద్ పూర్తి సహాయ సహకారం తో పట్లూరు గ్రామాన్ని పట్లూరు తండాను అభివృద్ధి చేస్తున్నాం అని తెలియ చేశారు. పట్లూరు జీపీకి 20 లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మీనేపల్లి కలాన్ లో బీరప్ప జాతర ఉత్సవాలు

**నవాబుపేట్ మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్**



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : ప్రతి మనిషి ఆధ్యాత్మిక చింతనతో మసలుకోవాలని నవాబుపేట కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్ అన్నారు. సోమవారం నవాబుపేట మండల పరిధిలోని మీనేపల్లి కలాన్ లో బీరప్ప జాతర ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నవాబుపేట మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో నడవాలని సూచించారు. గ్రామ దేవతలు గ్రామ ప్రజలు సుఖశాంతులతో జీవించే విధంగా ఆశీర్వదిస్తారని గుర్తు చేశారు. చీడపీడల నుండి గ్రామ ప్రజలను పాడి పంటలను రక్షిస్తారని ప్రజల ప్రగాఢ విశ్వాసం అన్నారు. దైవభక్తి కల ప్రతి వ్యక్తి అసాంఘిక కార్యకలాపాల వైపు ఎన్నడూ వెళ్లరని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని సామాజిక వర్గాలను ప్రేమతో ఆదరించే వ్యక్తులుగా సమాజానికి ఆదర్శవంతులుగా చలామణి అవతారని కొనియాడారు. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడు కుల మతాలకు అతీతంగా ఆదర్శవంతంగా జీవించే ప్రతి వ్యక్తి అభినందనీయుడని ప్రశంసించారు. గ్రామంలో జరిగే ప్రతి ఉత్సవం సామాజికంగా ఆర్థికంగా చైతన్యవంతం కలిగించేవిగా ఉంటాయని కీర్తించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ గౌడ్ గాలయ్య అశోక్ ముదిరాజ్ వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు బి ఆర్ ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



స్టాక్‌మార్కెట్లు వరసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సూచీలకు అండగా నిలిచాయి. పలు దిగ్గజ కంపెనీల షేర్లు రాణించడంతో సూచీలు లాభపడ్డాయి. ఫిబ్రవరిలో వాహన అమ్మకాల్లో గణనీయంగా వృద్ధి సాధించడంతో ఆయా కంపెనీల షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 415.49 పాయింట్ల లాభంతో 60224.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 117.10 పాయింట్ల లాభంతో 17711.45 వద్ద ముగిసింది. బంగారం 10 గ్రాముల ధర 139 రూపాయలు పెరిగి 55860 వద్ద ట్రేడయ్యింది. వెండి కిలో ధర 179 రూపాయలు పెరిగి 64580 వద్ద ట్రేడయ్యింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 82.47 రూపాయలుగా ఉంది.

లాభపడిన షేర్లు..

టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, టీసీఎస్, విప్రో, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందూస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫైనాన్స్, టెక్‌మహీంద్రా, మారుతీ సుజుకీ, టైటాన్ కంపెనీ, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, అదానీ పోర్ట్స్, అపోలో ఆస్పటల్స్ షేర్లు లాభపడ్డాయి.

నష్టపోయిన షేర్లు..

టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్స్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, దివిస్ ల్యాబ్, బజాజ్ ఆటో, ఇండాల్కో, జేఎస్‌బడ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.

## డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

**కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు**



ఆసిఫాబాద్ జిల్లా మార్చి 6 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల కొరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని,గతంలో కొవిడ్ పరీక్షల కోసం ఉపయోగించిన ల్యాబ్ లో డయాలసిస్ కేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల స్నేహభావంతో మెలగాలని,మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు,ఎంపిపి అరిగేల మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలి

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్**



ఆసిఫాబాద్ జిల్లా మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి) : ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, జిల్లా కేంద్రంలో డయాలసిస్ సంబంధించిన పరికరాలు వచ్చినప్పటికీ వాటిని ఉపయోగించడంలో డిఎంహెచ్ఓ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో చాలామంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారికి వైద్యం అందించాలంటే జిల్లాలో డయాలసిస్ కేంద్ర అవసరమని, దానికి సంబంధించినటువంటి పరికరాలు వచ్చినప్పటికీ వైద్య అధికారులు డిఎంహెచ్ఓ , ఆసుపత్రి సూపర్డెంట్ గాని ప్రారంభించడం లేదన్నారు. చాలామంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు మంచిర్యాల, కరీంనగర్, వరంగల్లు, హైదరాబాదు వెళ్లి అధిక డబ్బులు పెట్టి వైద్యం చేసుకుంటున్నారనీ అన్నారు. నిరుపేదలు గిరిజనులు డబ్బు పెట్టని పరిస్థితి ఉందని, అలాంటి వారి కోసము జిల్లాలో డయాలసిస్ కేంద్రనీ ఏర్పాటు చేయడంలో ఇక్కడున్న వైద్యాధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వెంటనే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని, డివైఎఫ్ఐ గా కోరుతున్నామన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొర్కుటె శ్యాం రావ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు సతీష్, దుర్గం పవన్ కోరెంగా మలశ్రి, జిల్లా సభ్యులు తాళ్లపల్లి రాజేష్ వద్లూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
మంగళవారం 07, మార్చి 2023

# అప్పు కాదు.. పెట్టుబడి

తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకువెళ్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఇది ఓర్వలేని కేంద్రం రాష్ట్రంపై మరో తప్పుడు ప్రచారానికి తెరలేపింది.తెలంగాణ అస్తిత్వాన్ని, పరిపాలనను, అభివృద్ధిని దెబ్బతీయడానికి ఇప్పటివరకు చేసిన కుట్రలు, కుతంత్రాలు పారకపోవడంతో రాష్ట్రం భారీ అప్పులు చేసిందంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నది.బీజేపీ తొమ్మిదేండ్ల పాలనలో వంద లక్షల కోట్ల అప్పుజేసినట్టుగా నివేదికలు చెబుతున్నాయి. ఇంత అప్పు చేసిన కేంద్రం.. తెలంగాణ మాదిరిగా 'దేశానికి ఇది చేశాం. ప్రజలకు అది చేశాం. ఒక స్థిరాస్తిని సంపాదించి పెట్టాం' అని చెప్పగలదా..? పైగా అన్ని రంగాల్లోనూ ముందుకెళ్తున్న తెలంగాణపై వివక్ష చూపుతూ.. మొగున్ని కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా బీజేపీ వ్యవహరిస్తున్నది.తెలంగాణ చేసిన అప్పులను భవిష్యత్తు తరాల కోసం వివిధ పథకాల పెట్టుబడులకు వినియోగించింది. పలురకాలుగా స్థిర, సుస్థిర ఆస్తులను తెలంగాణ సమాజానికి సమకూర్చింది. అందుకు సంబంధించిన ఫలాలను ఇప్పటికే ప్రజలకు అందించింది. ఇదంతా కేంద్రానికి తెలిసినా ఏదో ఒక అభాండం వేయాలన్న దురుద్దేశంతోనే ఆలోచనలు చేస్తున్నది. దేశ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లాంటివాళ్లు రాష్ట్రానికి వచ్చి పదేపదే ఈ విషయాన్ని చెప్తున్నారంటే దీనివెనుక ఉన్న మర్మం ఏమిటో అర్థమవుతున్నది. గడిచిన ఎనిమిదన్నరేండ్లలో చేసిన వంద లక్షల కోట్ల అప్పులను పక్కకుపెట్టి, అప్పుల పేరిట రాష్ట్రంపై బురద జల్లి ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం కేంద్రం ఎందుకు చేస్తుందన్న విషయాన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.కేంద్ర ప్రభుత్వం చెప్తున్నట్టుగా రాష్ట్రం చేసిన అప్పులను జల్సాలకు వాడిందా? లేక, సమైక్య పాలనలో అన్యాయం జరిగిన పలురంగాలను బలోపేతం చేయడానికి పెట్టుబడి పెట్టిందా? అన్నదానిపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే ఏది అప్పు? ఏది పెట్టుబడి? ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు? ప్రజలపై మమకారం ఉన్నదెవరికి? లేనిదెవరికి? ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసిందెవరు? చేయనిదెవరు? ప్రజల భవిష్యత్తు అవసరాలకు అనుకూలంగా స్థిరాస్తులను సమకూర్చిందెవరు? అప్పులు తెచ్చి, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మి ఆ నిధులను జల్సాలకు వినియోగించిందెవరు? అన్న ఎన్నో విషయాలను అర్థం చేసుకోవచ్చన్నది ఆర్థికరంగ నిపుణల విశ్లేషణ!దేశ ప్రజలకు జరుగుతున్న అన్యాయం, కార్పొరేట్ సంస్థల ముందు మోకరిల్లుతున్న తీరు, వనరులున్నా సద్వినియోగం చేసే సత్తా, సామర్థ్యం లేని ప్రధాని, కేంద్ర అసమర్థత, కీలకరంగమైన వ్యవసాయంపై వివక్ష, నియంతృత్వ పోకడల వంటి వాటిపై ఎదురుతిరిగి ప్రశ్నిస్తున్న ఏకైక సీఎం కేసీఆరే. కానీ, బీజేపీ అగ్ర నాయకత్వం తాను చెప్పిందే శాసనం అన్నట్టుగా వ్యవహరిస్తూ కేసీఆర్ అడుగుతున్న సూటి ప్రశ్నలను జీర్ణించుకోలేకపోతున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రం అస్తిత్వం, ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు శత విధాలుగా ప్రయత్నిస్తున్నది. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, గ్రాంట్లు ఇవ్వకపోగా ఎఫ్ఆర్బీఎం పరిమితుల పేరిట మోకాలడ్డుతున్నది. ఇవి చాలవన్నట్టుగా ఏకంగా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలకు తెరలేపిన విషయం ఇటీవలే కండ్లారా చూశాం. ఆ విషయం బహిర్గతం కావడంతో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులే టార్గెట్‌గా ఈడీ, ఐటీ, సీబీఐ, వంటి సంస్థలతో వరుస దాడులు చేయిస్తున్నది. అయినా కేసీఆర్ సర్కారు వాటిని లెక్క చేయకుండా ఎదురొడ్డి పోరాడటమే కాదు, కేంద్ర వైఫల్యాలను ఇతర రాష్ట్రాల్లోనూ ఎండగడుతున్నది. దీంతో కాషాయ పార్టీ కూకటి వేళ్లు కదిలే పరిస్థితులు ఏర్పడుతుండగా, రాష్ట్రంపై బురద జల్లేందుకు శత మార్గాల్లో ప్రయత్నిస్తున్నది. అయినా ఆ పార్టీ కపట నాటకాలు, కుట్రలు, కుతంత్రాలు, అవరోధాలను అలవోకగా అడ్డుకుంటున్న కేసీఆర్‌ను ఎలా దెబ్బకొట్టాలో తెలియక ఇప్పుడు అప్పులంటూ ప్రజలను పక్కదారి పట్టించే సరికొత్త డ్రామాకు తెరలేపింది.ప్రాజెక్టులు దాని అనుబంధ రంగం, విద్యు త్తు రంగం, మిషన్ భగీరథ ఈ మూడు రంగాలను మనం ఉదాహరణగా తీసుకుంటే.. రాష్ట్రంపై కేంద్రం ఎంత తప్పుడు ప్రచారానికి ఒడిగడుతున్నదో అర్థమవుతుంది. 2014-15 వరకు తెలంగాణ ప్రాజెక్టులపై అప్పటి ప్రభుత్వాలు పెట్టిన ఖర్చు కేవలం రూ.38 వేల కోట్లే. తెలంగాణ అవతరించిన అంటే గడిచిన ఎనిమిదేండ్లలో భారీ, మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులన్నింటిపైనా రాష్ట్ర ప్రభుత్వం పెట్టింది లక్షా 69 వేల కోట్లు. సాగునీటి రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం ఫలితంగా.. 2014-15 నాటికి 23.44 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే అది నేడు ఏకంగా 73లక్షల 33వేల ఎకరాలకు పెరిగింది. రాబోయే మూడేండ్లలో మరో 50 లక్షల 24 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది.స్వరాష్ట్రంలో కోటికిపైగా ఎకరాల ఆయకట్టును సృష్టించాలనే సీఎం సంకల్పం సాకారం కానున్నది. ప్రాజెక్టుల రీ డిజైనింగ్ పేరిట లక్షా 69 వేల కోట్ల పెట్టుబడి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై పెట్టినప్పుడు ప్రజలకు చేకూరిన ప్రయోజనాలు ఏమిటి? తద్వారా తెలంగాణ సమాజానికి సమకూరిన స్థిరాస్తులు ఏమిటి? అన్న దానిని కూడా పరిశీలించాలి. రాష్ట్రంలో వరి ఉత్పత్తి మూడు రెట్లు పెరిగింది. 2014-15లో ఉన్న 68.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నుంచి 2021-22 నాటికి 2 కోట్ల 2 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నది. ఈ రోజు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ మారింది. భూగర్భజలాలు పుష్కలంగా పెరిగాయి.అన్నింటికీ మించి భూముల ధరలు ఆకాశాన్నంటాయి.ఒక్కమాటలో చెప్పాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రంలో కనకవర్షమే కురిపించింది. గతంలో ఓ మారుమూల ప్రాంతంలో ఒక ఎకరం ధర రూ.2 లక్షలుంటే.. ఈ రోజు ఏ మూలకు వెళ్లినా రూ.20 లక్షలకు తక్కువ లేదు. పడావు పడ్డ భూములకు సైతం లక్షల్లో ధరలు పలుకుతున్నాయి. మెయిన్ రోడ్డు పక్కన భూములున్న రైతులు కోటీశ్వరులే. అలా లెక్కిస్తే పెరిగిన భూముల విలువ కొన్ని లక్షల కోట్ల ఉంటుంది. ఇది ప్రత్యక్షంగా రైతులకు చేకూరిన ప్రయోజనం. చెరువు నిండితే ఊరు బాగు పడుతుందన్నది సామెత. నీరు సమృద్ధిగా ఉంటే సమస్త కులవృత్తులు పునర్జీ వం పోసుకుంటాయి. దీనికి నిదర్శనం 2016-17లో 1.93 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి కాగా, ఆనాడు దాని విలువ రూ.2, 190 కోట్లు. ప్రస్తుతం 2021-22లో ఆ సంపద 3.9 లక్షల టన్నులకు పెరగగా, దీని విలువ రూ.5,860 కోట్లకు చేరింది. రైతుబం ధు కింద 65 లక్షల మంది రైతులకు నేరుగా 65వేల కోట్ల పెట్టుబడి సాయం అందించిన ఒకే ఒక్క ప్రభుత్వం తెలంగాణ. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై పెట్టిన పెట్టుబడులే నేడు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణను దేశం ముందు తీర్చిదిద్దాయి. ప్రాజెక్టులు దాని అనుబంద రంగాలపై లక్షా 69 వేల కోట్లు, విద్యుత్తు రంగంపై రూ.38,070 కోట్లు, మిషన్ భగీరథపై రూ.36,900 కోట్లు ఈ మూడు రంగాలపై మొత్తం ఇప్పటివరకు ప్రభుత్వం రూ.2,43,970 కోట్ల పెట్టుబడులు పెట్టి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నది. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా ప్రాజెక్టులు కట్టి తెలంగాణ ప్రజలకు తరగని స్థిర ఆస్తులను సంపాదించి పెట్టింది.

# ఈశాన్య ఫలితాలపై బిజెపి హైప్- నిజానిజాలు




త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఫలితాల తర్వాత ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి విజయాలు చారిత్రాత్మకమైనట్టు మోతమోగుతున్నది. ఇందుకు ప్రధాని మోడీ వ్యక్తిగత ప్రభావం కారణమైనట్టు, ఆయన పథకాలతో అభివృద్ధి సంక్షేమం మెరుగయ్యాయని సంతోషించినందుకే ప్రజలు గెలిపించినట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్నది. ఉత్తరాదికే పరిమితమైన పార్టీగా చెప్పుకునే బిజెపి దేశం మూలమూలనా చొరబడిందని ఈ ఫలితాలతో తిరుగులేని విధంగా రుజువైందనే పల్లవి వినిపిస్తున్నది. త్రిపురలో వామపక్షాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ దెబ్బతినడం కీలక పరిణామంగా చిత్రించబడుతున్నది. ఎన్నికల్లో జయాపజయాలను బట్టి ఈ విధమైన వాదనలు ప్రచారాలు సాగడంలో ఆశ్చర్యం లేదు గానీ పూర్తి వాస్తవమేమిటనేది కూడా అర్థం చేసుకోవడం అవసరం. ఈ ఫలితాలలో బిజెపికి అంత సీన్ కనిపించిందా? ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాలలోనూ వాటితోపాటు జరిగిన ఉప ఎన్నికలలోనూ బిజెపి సాధించిన ఫలితాలేమిటి, పరిమితులేమిటి? లోతుగా చూడాల్సి వుంది. అలా చూసినప్పుడు బిజెపి నేతలు అంతగా జబ్బలు చరుచుకోవలసిన అద్భుత ఫలితాలేమీ కాదని, అవైనా అనేక అక్రమాలు ధనబలం నిర్బంధంతో లభించినవేనని స్పష్టమవుతుంది. పైగా ఇవి చాలా చిన్న రాష్ట్రాలను వశపర్చుకోవడం కోసం ప్రపంచంలోనే పెద్దదిగా టముకు వేసుకునే పార్టీ పడరాని పాట్లు పడటం. ఫలితాలు రాగానే ప్లేటు మార్చడం కూడా కనిపిస్తుంది. ఈ చిన్న రాష్ట్రాలలో ఇతరులతో రకరకాల బేరసారాలు మత రాజకీయాలు నెరిపిన బిజెపి ఇదేదో దేశవ్యాపిత విజయంలా చెప్పుకుంటే మీడియా కూడా వంతపాడటం వింత గొల్పుతుంది. అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపూర్, త్రిపురల్లో బిజెపి అధికారానికి రావడం, మేఘాలయ, మణిపూర్‌లలో మిత్రపక్షాల సాయంతో పాగా వేయడం గొప్ప పరిణామాలుగా చెప్పేవారు. గతంలోనూ కేంద్రంలోని కాంగ్రెస్ ఈ తరహా ఆధిక్యత నడిపించుకుందని మర్చిపోతుంటారు. ఈశాన్య రాష్ట్రాలు గానీ జమ్మూ కాశ్మీర్‌గాని కేంద్రంలో ప్రభుత్వాన్ని బలపరిస్తే తప్ప బతకలేని దురవస్థ ఇందుకు కారణమని దేశమంతటికీ తెలుసు. మోడీ హయాంలో పెద్ద పెద్ద రాష్ట్రాలకే నిధులు కేటాయించకుండా వివక్షతో దాడులతో లోబర్చుకుంటున్న నేపథ్యం ఈశాన్యానికి మరింత ఎక్కువగా వర్తిస్తుందని చెప్పనవసరం లేదు. పైగా అధికార అవకాశవాదంలోనూ వేర్పాటువాద పోకడలలోనూ అక్కడి పాలకపక్ష నాయకులు ఆరితేరారు గనక ఆ పని మరింత తేలికే. 35 ఏళ్ల వామపక్ష పాలనలో స్థిరత్వం కాపాడుకున్న త్రిపుర మినహా అన్నిచోట్లా ఇదే జరిగేది. దాన్నే మోడీ, హోంమంత్రి అమిత్‌షా వంటి వారు తమవైపునకు తిప్పుకోవడంలో గొప్పతనమేమీ లేదు. వీటిలోని హెచ్చరికను గుర్తించడం అవసరమే అయినా అతిశయోక్తులను ఆమోదించనవసరం లేదు.

**త్రిపురలో జరిగిందేమిటి?**

ఇప్పుడు ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లోనూ ఒక్క త్రిపురలో మాత్రమే బిజెపి తానుగా ఆధిక్యత సాధించింది. అందుకోసం ఎన్ని దౌర్జన్యాలూ నిర్బంధాలు జరిగాయో గతవారం చెప్పుకున్నాం. స్వేచ్ఛగా ఓటేయనిస్తే తప్పక గెలుస్తామని మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ చేసిన వ్యాఖ్య నేను గుర్తు చేశాను. అలా జరగడం లేదనీ దాడులతో పాటు అక్రమాలు ధనప్రలోభాలు పెరుగుతున్నాయని సిపిఎం నాయకులు అనేకసార్లు ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు. కాని అవి ఆగింది లేదు. గిరిజన ప్రాంతాలలో ఎన్నికల ముందే పుట్టుకొచ్చిన త్రిప్రి మోతె పార్టీ ఓట్ల చీలికలోనూ సీట్ల చీలికలోనూ పెద్ద ప్రభావమే చూపింది. దాంతో కేంద్ర బిజెపి నాయకులు మంతనాలాడారు. ప్రత్యేక రాష్ట్రం ప్రత్యేక దేశం అంటున్నా వారి మంతనాలు ఆగలేదు. ఆ ఒక్కటి తప్ప అన్నిటికీ సిద్ధమని బాహాటంగానే సంకేతాలిచ్చారు. ఇంతకూ ఈ పార్టీ ఎవరిదంటే పిసిసి అధ్యక్షుడుగా వుండి నిష్క్రమించిన మాజీ యువరాజు ప్రద్యుమ్నది. అంటే ఆయన కాంగ్రెస్ ఓట్లలోనూ గండిపెట్టాడనేది స్పష్టమే. సీట్ల సర్దుబాటులోనూ చివరిదాకా సాగదీసిన కాంగ్రెస్ నాయకత్వం పాత్ర మరొకటి. ఇన్నిటి మధ్య సిపిఎం, వామపక్షాల నాయకులు ప్రాణాలకు వెరవక పోరాడారు. బిజెపి విచ్చిన్నశక్తుల దాడులను ఎదుర్కొన్నారు. ఫలితాలు వచ్చాక చూస్తే కాంగ్రెస్‌తో పరస్పర పోటీ నివారణ చేసుకున్నప్పటికీ వామపక్షాల ఓట్ల శాతం పెరగకపోగా గతసారి కన్నా పదిహేను శాతం వరకూ తగ్గినట్టు కనిపిస్తుంది. ఈ ఒడంబడిక పొరబాటనే వాదనలు మీడియాలో మొదలైనాయి. విధానపరమైన నిర్ణయం గనక ఇప్పుడు దానిపై తర్జనభర్జనల కన్నా సమగ్ర సమీక్ష కోసం ఎదురుచూడటం మంచిది. కానీ అసలు సమస్య మాత్రం మరోసారి వేర్పాటు వాద విచ్ఛిన్నకర పోకడలు పెంచే శక్తులకు ఊతమివ్వడం. గతంలో ఆస్సాంలో కాంగ్రెస్ ఇలాగే చేయడం గుర్తుండే వుంటుంది. ఇప్పుడు బిజెపి అదే పని చేస్తున్నది. ఇంతా చేసినా ఐపిఎఫ్‌టితో కలసి కూడా అది అత్తెసరు ఆధిక్యతనే తెచ్చుకోగలిగింది. బిజెపిని వ్యతిరేకించేది తానేనన్నట్టు గొప్పలు పోయే తృణమూల్ కాంగ్రెస్ కూడా అన్నిచోట్ల పోటీ పెట్టి ఓట్ల చీలికకు కారణమైంది. వీటన్నిటినీ ఉపయోగించుకున్న బిజెపి నేతలు ఇప్పుడు మాత్రం మహిళలు యువత తమకు బాగా ఓటేశారని చెప్పుకుంటున్నారు. ఏమైనా రాజకీయంగా బిజెపికి అంతర్గత కలహాల మధ్య వచ్చిన త్రిపుర విజయం కీలకమే అవుతుంది. ఇన్ని నిర్బంధాల మధ్య సిపిఎం, ఇతర వామపక్ష కార్యకర్తల కృషి అభినందనీయం. త్రిప్రి మోతె రానున్న రోజులలో ఎలాటి సమస్యలు, సవాళ్లు సృష్టించేది బిజెపి అవకాశవాదం ఏ పరిణామాలకు కారణమయ్యేది చూడాల్సిందే.

**మేఘాలయలో వెనకడుగు, నాగాలాండ్‌లో జూనియర్ పాత్ర**

ఈశాన్య విజయం అంటూ అతిగా చెప్పుకుంటున్న బిజెపి మిగిలిన రెండు రాష్ట్రాలు నాగాలాండ్, మేఘాలయలో స్వంతంగా సాధించిందేమీ లేదు. మేఘాలయలో కొర్నార్డ్ సంగ్మా నాయకత్వంలోని నాగాలాండ్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) 26 స్థానాలతో పెద్ద పార్టీగా వచ్చింది. ఈ పార్టీతో కలసి మిశ్రమ కూటమిలో వుండిన బిజెపి ఎన్నికల ముందే వైదొలగింది. ఈశాన్యంలో అన్నిటికన్నా అవినీతికరమైన ప్రభుత్వం అది అని స్వయంగా హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. కాని ఇప్పుడు రెండుస్థానాలు గెలిచిన బిజెపి ఆ పార్టీతోనే చేతులు కలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తున్నది. ఈ మేరకు సంగ్మా గవర్నర్‌ను కలిసి అవకాశం కోరాడు. అమిత్ షా సమక్షంలో ప్రమాణస్వీకారం చేయడానికి ముహూర్తం చూసుకుంటున్నారు.హిల్ పీపుల్స్ పార్టీకి చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్వతంత్రులు కూడా తమతో వున్నారని సంగ్మా చెబుతున్నా ఆ పార్టీలు మరోలా మాట్లాడుతున్నాయి. కేంద్రం వారిని దారికి తెచ్చినా ఆశ్చర్యం లేదు. 11 స్థానాలు తెచ్చుకున్న మాజీ పాలక కూటమి భాగస్వామి యుడిపి, రెండు తెచ్చుకున్న పివిపి పార్టీ కూడా బేరసారాలు సాగిస్తున్నాయి. ఇక నాగాలాండ్‌లో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నెయిఫియు రియో నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నది. నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) నాయకుడైన రియో కు 12 మంది బిజెపి సభ్యుల మద్దతు వున్నది.ఇక్కడ కూడా బిజెపి జూనియర్ భాగస్వామిగానే వుంది. కనుక బిజెపి ఈ రెండుచోట్ల గెలిచేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదమే. పైగా అది మోడీ ప్రతిష్ట, బిజెపి విధానాల విజయంగా చెప్పడం మరీ విడ్డూరం. ఈ సర్కార్లు స్థిరంగా వుండటం కూడా కష్టమే. అయితే ముందే చెప్పుకున్నట్టు కేంద్రం మీద పరాధీనత వల్ల వారు అనివార్యంగా లోబడిపోతుంటారు. అందులో నిలబడిన వారిని బిజెపి తన వైపునకు తిప్పుకుంటుంది. ఈ ప్రక్రియకు ఆధ్వర్యం వహించే అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిస్వాస్ శర్మను కొందరు మరో మోడీగా వర్ణిస్తుంటారు కూడా.

**మరో విడత తర్వాతే**

హిందుత్వమే తమ సిద్ధాంతమని రెచ్చగొట్టే బిజెపి ఈశాన్య భారతంలో అధికంగా వున్న క్రైస్తవ ఓటర్ల కోసం మరెవరికంటే అధికంగా బుజ్జగింపు విధానాలు అనుసరిస్తుంది. వారి మతపరమైన కోర్కెలకు పెద్దపీట వేస్తూ గిరిజనాభివృద్ధిని ఉపేక్షిస్తుంది. ఉత్తరాదిని గోరక్షణ గురించి గగ్గోలు పెట్టి అనేకమంది ప్రాణాలు పోవడానికి కారణమైన సంఘ పరివార్ ఈశాన్యంలో మాటమారుస్తుంది. గొడ్డుమాంసం తినడం అక్కడ సర్వసాధారణం గనక ఆవును పక్కన పెట్టేస్తుంది ! జెరూసలేము యాత్రలకు సహాయం వాగ్దానం చేస్తుంది. ఇవన్నీ మతసహనంతో చేస్తే ఫరవాలేదు గాని ఓట్లకోసమే కావడం విపరీతం. అస్సాంలో అత్యుత్సాహంతో హిందూత్వ పాఠాలు చెప్పే ముఖ్యమంత్రి శర్మ తక్కిన ఇతర చోట్ల మొత్తం మార్చేసి అదే తన చాణక్యమంటారు. ఇవన్నీ అవకాశవాద రాజకీయ విన్యాసాలే. ఉత్తరాదిలోనే పూర్తిగా గెలవలేని బిజెపి దక్షిణాన పాగా వేసేందుకు నిరంతరం విఫలయత్నాలు చేస్తున్నది. తూర్పు పశ్చిమల్లో కూడా దానికి ప్రత్యర్థి రాజకీయ శక్తులున్నాయి. ఒరిస్సా, బెంగాల్ వంటి చోట్ల గెలవలేకపోతున్నది. దక్షిణాన సరేసరి. కర్ణాటక కూడా చేజారిపోతుందని ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు జరిగిన ఉప ఎన్నికలలో కూడా కాంగ్రెస్ మూడు, బిజెపి,మిత్రులు మూడు తెచ్చుకున్నారు, బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్ చోటు సంపాదించింది. తమిళనాడులోని ఈరోడ్‌లోనూ మహారాష్ట్రలోనూ గెలిచింది. ఇవి మిత్రపక్షాల తోడువల్ల గెలిచినవే కావడం గమనార్హం. కాంగ్రెస్ ఇప్పటికీ బిజెపికి వ్యతిరేకంగా సరైన విధానం తీసుకోలేకపోవడం, తనే నాయకత్వం వహించాలన్నట్టు మాట్లాడుతుండడం కనిపిస్తుంది. ఇవన్నీ ఎలా వున్నా బిజెపి ఈశాన్య ప్రాంతంలో చిన్న చితక పార్టీలతో కలసి సాగించే కపట నాటకాన్ని దేశవ్యాపిత విస్తరణకు సాక్ష్యంగా చూపాలనుకోవడం కుదిరేది కాదు. ఈ ఏడాది కర్ణాటక, చత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, తెలంగాణ, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీల ఎన్నికల తర్వాత దేశ రాజకీయ ముఖచిత్రం మరింత స్పష్టమవుతుంది.

# గుండె చప్పుడు

నీ చుట్టూ గోడను కట్టి
నిన్ను ద్వారపాలకులై
కాపలా కాస్తారు కొందరు
నువ్వు అప్పుడు ఇక ఒక సమాధివి !

నువ్వు వద్దన్నా వినక
నిన్ను పల్లకీలో కూర్చోబెట్టి
బోయీలై మోస్తారు కొందరు
అప్పుడు నువ్వు ఒక ఉత్సవ విగ్రహానివి!

నీ కోసం అద్దాలను పేర్చి
తాము నీ అద్దాలమని
చూసుకూంటూ నడవమంటారు కొందరు
నువ్వప్పుడు ప్రతిబింబించలేని ఒక అద్దానివి!
నీకోసం పందిరి సిద్ధం చేసి
నువ్వొక పాకే మొక్కవని చెప్పి
భూమిలోకి పాతుకుపోమని చెబుతారు కొందరు
అప్పుడు నువ్విక ఒక చిగురించలేని అవస్థవి!

ఎవరెవరో నిన్ను తమ రూపాలను చేస్తారు
చేసామనుకుని ప్రాణం పోయడం విడమరుస్తారు
లేదా నీలో ఉన్న ప్రాణాన్ని విస్మరిస్తారు
నువ్వు, చెబుతావు కదా :
పంజరాన్ని వదిలే చూపుతో, నవ్వుతో
నీ స్వేచ్ఛైక పలుకులతో,
నువ్వొక మనసు ఉన్న
సొంత బుద్ధి ఉన్న
స్వతహాగా చిగురించే
లేతాకులా కాంతులీనే
తళతళా అద్దంలా మెరిసే
ప్రాణంతో చలించే శరీరానివనీ...
పార్థివ దేహాన్నీ,
పువ్వులతో చుట్టి ఉన్న
సమాధినీ కాదనీ!
... అంతా ఒక గుండె చప్పుడును చేసి...

**- అనూరాధ బండి**

# గొంతు సలపరం

ఇక్కడ పక్షులకు
ప్రజాస్వామ్య జీవులకు
కొన్ని షరతుల సీసం చెవిలో
పోయజుస్తున్నరు
ఆచార, సంస్కార, భక్తిపడగ నీడలో
అభద్రంగా బతికితే బస్..
హేతువు హేతువుగా చూడని
అహేతుక సమాజం కసాయు
రంగుపులుముకొని
ప్రశ్నించే వర్షాన్ని
అజ్ఞాన గొడుగుతో ఆపచుస్తుండ్రు
హేతువనే జడివానకు
యదార్థ ప్రళయానికి
ఏ గొడుగూ నిలవదు !
భక్తి ఇంజెక్షన్ ఇంజక్ట్ చేసి
శాస్త్రాన్ని విశ్వాసాలతో కల్పుతున్న
టెంకాయ సమర్పణ క్షిపణి
ముందు మోకరిల్లిన శాస్త్రం ...
చదివిన నదువు పొందిన
అభినందన పత్రాలు
గోడమీది క్యాలెండర్లే..!

అందని అమూర్త భావానికి ఉన్న
విలువ
రక్తమాంసాలతో
దేశ ఉత్పత్తిని ఉచ్ఛస్థితికి
శ్రమ మూటను విప్పి ఆకలి తీర్చి
హేతువును పంటలా పండిస్తే,
ఆలోచన ఎరువు వేస్తే,
దేశద్రోహుల జాబితా సిద్ధం..
అడ్డగించే విషపు ఆలోచన జీవికి
క్షణాలలో విడుదల పవనాలు
మిన్నకున్న బుద్ధిజీవి మౌనం
దేనికి సంకేతం?
మనిషిలోని మానవత్వం తట్టి లేపే
ఏ చెట్టునైనా
ఛాందస గొడ్డలితో
తెగనరుకుతున్నరు

**- నాగరాజు మద్దెల**

## సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు పూర్తి వేతనం చెల్లించాలి



ఖమ్మం మార్చ్ 6 ప్రజా పాలన ప్రతినిధి:ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్నటువంటి పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు ఇంటిగ్రేటెడ్ పాలసీ నెం 60 జీవో ప్రకారం 12093 రూపాయలు రావలసిందిగా వందమంది కార్మికులకు వారి అకౌంట్లో 11,000 మాత్రమే వేస్తూ ఉన్నారు అదేవిధంగా పిఎఫ్ ఈఎస్ఐ అమౌంట్ అకౌంట్ లో ఇప్పటివరకు వేయలేదని జనవరి, ఫిబ్రవరి నెలలో జీతాలు కూడా ఇవ్వలేదు అని వాటి విషయమై ఖమ్మం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజేష్ రావు మరియు అడ్మినిస్ట్రేటివ్ ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అమర్ సింగ్ గార్లకు వినతి పత్రం అందజేసి న్యాయం చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో వేముల ధర్మరాజు, లలిత, రమ ,రాధ, ధనలక్ష్మి ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## మామునూర్ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సిఎల్పీ నేత భట్టి విక్రమార్క



ఎర్రుపాలెం, మార్చి 6 ప్రజా పాలన ప్రతినిధి: మండలం మామునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ (ఆరోగ్య ఉప కేంద్రం) ను,గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సిఎల్పీ నేత లిభట్టి విక్రమార్క మల్లులి ప్రారంభించారు ఈ సందర్భంగా సిఎల్పీ నేత పంచాయితీ పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారబత్తిని మోహన్ రావు,బండారు నర్సింహ రావు ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేమిరెడ్డి,సుధాకర్ రెడ్డి,%జూఎఎ% సభ్యులు శీలం ప్రతాప్ రెడ్డి,ఎంపీటీసీ నల్లపురెడ్డి ప్రవల్లిక,కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగి రెడ్డి, పులుబండ్ల చిట్టిబాబు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కిలారి కృష్ణయ్య మృతి బాధాకరం..: జడ్పీటీసీ దిరిశాల ప్రమీల



తల్లాడ, మార్చి 6 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలోని ముద్దునూరు గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన కీలారి వెంకటేశ్వర రావు తండ్రి కృష్ణయ్య ఇటీవల మరణించారు. సోమవారం ఆయన దశ దిన కర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ జడ్పీటీసీ దిరిశాల ప్రమీల హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కృష్ణయ్య మృతి బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో కలకోడిమ ఎంపీటీసీ ఆదూరి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జోనల్ చైర్మన్ దిరిశా ల దాసురావు, నాయకులు కట్టా రాము, భూపతి రావు, ముద్దనూరు రైతు సమన్వయ నాయకులు కిలారీ ప్రసాదు, కట్టా రవి తదితరులు ఉన్నారు.

## తాడికల్ లో ముగిసిన కంటి వెలుగు శిబిరం



శంకరపట్నం మార్చి 06 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో రైతు వేదిక కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం సోమవారం తాడికల్ గ్రామంలో ముగించుకొని మంగళవారం చింతకుంట గ్రామంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డా. సంధ్యారాణి తెలియజేశారు. ఈ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తాడికల గ్రామంలో 13 పని దినాలలో 2000 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి 347 మందికి కంటి అద్దాలు అందజేసినట్టు 522 మందికి ప్రత్యేక కళ్లద్దాలను ఆర్డర్ చేసి అందించనున్నట్లు డాక్టర్ తెలియజేశారు. ఈ శిబిరంలో ఏఎన్ఎంలు సరస్వతి, వినోద సహాయ సిబ్బంది కె.సర్వోత్తమ్, ఆప్తమాలజిస్ట్ కె.రుచిత, డీఈఓ వెంకట సాయి, ఆశా కార్యకర్తలు స్వయంప్రభ, స్వప్న, రాధా, లావణ్య, లక్ష్మిలు ఈ కంటి వెలుగు శిబిరంలో విధులు నిర్వహిస్తు, కంటి పరీక్ష కోసం వచ్చే గ్రామస్తులకు సహాయ సహకారాన్ని అందిస్తున్నారు.

# చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించటానికే ప్రగతి నివేదన యాత్ర



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 6ప్రజాపాలన ప్రతినిధి : ప్రగతి నివేదన యాత్రలో భాగంగా 43వ రోజు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామంలో గడపగడపకు తిరిగి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే ఆధ్వర్యలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి పనులను వివరిస్తూ. ప్రజలకు ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నాయెూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోహెడ గ్రామ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి బంటి మాట్లాడుతూ. ప్రగతి నివేదన యాత్ర జనవరి 22న నందివనపర్తి గ్రామంలో ఆనందీశ్వరుని ఆశీస్సులు తీసుకొని ప్రారంభమై. నేటివరకు 2 మున్సిపాలిటీలు, 3మండలాలు 43రోజులు 75 గ్రామాలు, 575కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ కోహెడ గ్రామానికి వచ్చాను.ఎమ్మెల్యే నాకు ఒకటే విషయం చెప్పారు. గత 3 ఎన్నికల్లో ప్రజలు మనకు ఓట్లేసి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి, ఆశీర్వదిస్తున్నారు. కాబట్టి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకొని, నాదృష్టికి తీసుకువస్తే నేను వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. అందులో భాగంగానే ఈరోజు ప్రగతి నివేదన యాత్రగా మీకో హెడకు రావటం జరిగింది.ఇప్పుడు ఎలాంటి ఎన్నికలు లేవు, మేము ఓటు అడగడానికి రాలేదు. గత సంవత్సరాల నుంచి తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామంలో ఉన్న 2,4,5 వార్డులలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని బంటి అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు ఇన్ని నిధులు వచ్చేవి కావు ఒకగ్రామంలో బీటీ రోడ్డు కాదు మట్టి రోడ్డు వేయడానికి కూడా 2లక్షల రూపాయల శాంక్షన్ ఇవ్వాలంటే ఎన్నో నెలలు పట్టేది ఎంతో కష్టంగా ఉండేది. అలాంటిది కేసీఆర్ ముఖ్యమంత్రి అయినతర్వాత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో.ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో బీటీ రోడ్లు సీసీ రోడ్లు డ్రైనేజీ ఇతర అనేక సంక్షేమ అభివృద్ధి పనులు చేసుకుంటున్నాం. పేదింటి ఆడబిడ్డ పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులకు భారంగా ఉండేది, వారి గుండెల మీద కుంపటి ఉన్నట్టుండేది. గతంలో ఆడబిడ్డ పెళ్లి ఖర్చులకు మేనమామ కొంత ఆర్థిక సహాయం చేసేవారు కానీ ఇప్పుడు చేస్తున్నారా ఇవ్వడం లేదు కాబట్టే గొప్ప మనస్సున్న మన సీఎం కేసీఆర్ ఆలోచన చేసి ఆడబిడ్డ పెళ్లి చేస్తే తల్లి పేరుమీద 1,00,116 రూపాయల చెక్ ఇచ్చి మేనమామగా ఆదుకుంటున్నారు.అదేవిధంగా గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన తర్వాత అమ్మ ఒడి పథకం ద్వారా ఆడబిడ్డ పుడితే 13వేలు, మగబిడ్డ పుడితే 12వేల రూపాలయలు సీఎం కేసీఆర్ ఇస్తున్నారు. వీటికి తోడు చంటిపాపకు కేసీఆర్ కిట్ ఇస్తారు. వాటిలో సబ్బులు, పౌడర్, అయిల్, క్రీమ్, టవల్ ఇతర వస్తువులు ఉంటాయని బంటి అన్నారు.కోహెడ గ్రామంలో ఉన్న 4వ వార్డులో కౌన్సిలర్ జ్యోతి గారు పెద్దయెత్తున అభివృద్ధి పనులు చేస్తున్నారు. కానీ 2,5వార్డులలో పరిస్థితులు బాగా లేవు. వాటన్నింటిని మార్చాల్సిన అవసరం ఉందని ఆరెండు వార్డులలో అభివృద్ధి పనులు జరగకుండా కొందరు అడ్డుకుంటున్నారు వాళ్లు ఎవరనేది మీకు బాగా తెలుసు. రాబోయే రోజుల్లో ఆవార్డుల్లో మార్పు జరగాలని, కాబట్టి మీరు కూడా ఆలోచన చేయాలని బంటి అన్నారు.ప్రగతి నివేదన యాత్రలో బీఆర్ఎస్ పార్టీ తుర్కయాంజల్ మున్సిపల్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మా రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, 4వ వార్డు కౌన్సిలర్ జ్యోతి జంగయ్య, మహిళ అధ్యక్షురాలు అశ్విని, 2,4,5వ వార్డుల అధ్యక్షురాలు యాదమ్మ, శోభ, సునీత, మాజీ సర్పంచ్ బిందు రంగారెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ బల్దేవ్ రెడ్డి, మైలారం రవీందర్, తిరుమల్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మాచారి, లక్ష్మమ్మ నర్సింహ్మా, విజయాబ్బాబు, ఆంజనేయులు, శ్రీనివాస్ కురుమ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీవైఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇనుప విద్యుత్ స్తంభాల ఇబ్బందులకు పరిష్కారం

**50 ఏళ్ల నాటి ఇనుప విద్యుత్తు స్థంభాల తొలగింపు**
**వాటి స్థానంలో నూతన సిమెంటు విద్యుత్తు స్థంభాలు**
**జడ్పిటిసి చొరవతో సత్వర పరిష్కారం**





చేవెళ్ల మర్చి 6, (ప్రజాపాలన):చేవెళ్ల జెడ్పీటిసి మర్పల్లి మాలతి క్రిష్ణారెడ్డి చొరవతో దశాబ్దాలుగా కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులుకు తెరపడింది. గత యాబై ఏళ్ల క్రితం చేవెళ్ల పట్టణంలో ఆయా కాలనీలో అప్పట్లో ఇనుప విద్యుత్తు స్థంభాలు వేయించి ప్రభుత్వం విద్యుత్తు సరఫరా చేయించింది. అయితే కాల క్రమేణ వాటి స్థానంలో సిమెంట్ విద్యుత్తు స్తంభాలను వేస్తున్నారు. కారణం వర్షం కురిసిన సమయంలో, లేదా షాక్ సెర్క్యూట్ సందర్భంలో విద్యుత్తు షాక్ లు వస్తున్నాయి. దీంతో చేవెళ్ల లోనే గాక ఎక్కడైన ఇనుప విద్యుత్తు స్తంభాలు ఉంటే తీసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయితే చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లోని ప్రజలు తమ ఇళ్ల ముందు గల విద్యుత్తు స్థంభాల వల్ల వర్షం కురిసిన సమయంలో విద్యుత్తు షాక్ వస్తుందని, ఇనుప స్థంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా పలు మార్లు విద్యుత్తు కార్యాలయం చుట్టు తిరిగారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కాలనీ వాసులు జడ్పిటీసీ మర్పల్లి మాలతి క్రిష్ణారెడ్డి దృష్ఠికి సమస్యను తీసుకురాగా ఆమే వెంటనే స్పందించారు. ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యలు సంబంధిత విద్యుత్తు అధికారులను ఆదేశించారు. కేవలం మూడు రోజుల్లో ఇనుప విద్యుత్తు స్తంభాలను తొలగించి నూతన సిమెంట్ విద్యుత్తు స్తంభాలను వేసి విద్యుత్తును ఏదావిదిగా పునరుద్ధరించారు. దీంతో సదరు కాలనీ వాసులు జెడ్పీటిసి మాలతి క్రిష్ణారెడ్డిని అభినందించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాల మాదిగల సమాధుల పక్కన మా సమాధులా?

**ఎస్సీల ఇళ్ళ మధ్యలో పాత స్మశాన వాటిక**
**ఇళ్ల మధ్యలో నుంచి తొలగించి' ప్రభుత్వం కేటాయించిన**
**రెండు ఎకరాల వైకుంఠధామంల భూమిలో**
**సమాధులు పెట్టాలన్న దళితులు**
**ఇక్కడే సమాధులు పెడతామన్న బీసీలు**
**వివాదాస్పదంగా మారిన స్మశాన వాటిక**
**ఇరు వర్గాల మధ్య తోపులాట, గొడవ**
**అధికారుల నిర్లక్ష్యం వల్ల వర్గాల మధ్య గొడవ**




చేవెళ్ల మర్చి 6, (ప్రజాపాలన): చేవెళ్ల మండలంలోని దామరగిద్ద గ్రామంలో గత నాలుగు రోజులుగా వైకుంఠ దామం పై గ్రామంలోని దళితులు మరియు బిసిలు ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తుంది. పూర్వం స్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలంలోనే ఉప్పుడు కూడా అక్కడే సమాధి చేసుకుంటాం అంటున్నా బిసిలు. ఇక్కడ వద్దు ఇల్లుకు దెగ్గర ఉంది. ఇన్ని రోజులు అంటే వేరే వైకుంఠదామం లేకుండే అప్పుడు ఏమి అప్జెక్షన్ చేయలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టంగా పల్లె ప్రగతి లో భాగంగా నూతనంగా స్వర్వే నెంబర్ 153లో రెండు ఎకరాలలో వైకుంఠ దామం ఏర్పాటు చేసి అని సౌకర్యాలు కల్పించింది.అందులోనే ఊరిలో ఉన్న అందరు కుల మతాలకు అతీతంగా సమాధి చేసుకుందాం అని వివాదం జరుతున్న సందర్భంగా సోమవారం గ్రామానికి ఎంపిపి, జడ్పీటీసీ, బిఆర్ఎస్ పార్టీ మండల్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ వచ్చి వివాద స్థలాని పరిశీలించి మాట్లాడుతున్న క్రమంలో ఇరు వర్గాల వారు ఎక్కరికొక్కరు కొట్టుకున్నారు. సమాచారం తెలుసున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాల వారికి సర్ది చెప్పారు. మాల మాదిగల సమాధుల పక్కన మేము సమాధులు చేయాలన్న అనే భావన బిసిలకు వచ్చింది అన్నారు.ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇరు వర్గాల వారు కొట్టుకునే స్థాయికి వివాదం చేరుకుంది. పిర్యాదు తీసుకున్న వెంటనే ప్రభుత్వ అధికారులు వచ్చి నిదరణ చేసుంటే ఈ గొడవ కాకుండే అనే గ్రామస్థులు మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్డీఓ, ఎంఆర్ఓ వచ్చి సమస్యను పరిష్కరించాలని, గ్రామస్థులు కోరుకున్నారు.గొడవ జరుగుతున్నప్పుడు ఎంపిపి విజయ లక్ష్మి రమణ రెడ్డి,జడ్పీటీసి మాలతి కృష్ణ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, బిఆర్ పార్టీ మండల్ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ అక్కడే ఉన్నారు.

## జర్నలిస్టు లకు ఇండ్ల స్థలాలు ఇవ్వండి

**జిల్లా కలెక్టర్ ను కలిసిన తాండూర్ పాత్రికేయులు**



మంచిర్యాల బ్యూరో, మార్చి 06, ప్రజాపాలన:జర్నలిస్టు లకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతూ తాండూర్ పాత్రికేయులు సోమవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తాండూర్ క్లబ్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా సమాచారం సేకరించి, చేరవేస్తున్న జర్నలిస్టులు స్వంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగాత పత్రికలలో పని చేస్తూ ప్రజా సమస్యలపై అనేక వార్తలు రాస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అధికారులకు తెలియజేస్తూ పాత్రికేయులు వృత్తి పరంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామన్నారు.గతంలో మండలానికి చెందిన కొంతమంది పాత్రికేయులకు ఇండ్ల స్థలాలకు భూమి కేటాయించారని, లబ్ది దారులను గుర్తించి అర్హులైన తమకు కూడా ఇండ్ల స్థలాలు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు దుద్దిల్ల రామ్మోహన్ ,ఈర్ల శ్రీనివాస్ ,అసం అశోక్ ,సిద్ధంసేటి పవన్ కుమార్, మీనుగు సూర్య ప్రకాష్,శనిగారపు వినోద్ ,కొడిమల శ్రీకాంత్ ,మోర్ల జెనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పొందటం చాలా సంతోషం

**మధిర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు వేమవరపు వెంకటేశ్వర శర్మ**




మధిర ,మార్చి 6ప్రజా పాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వారి ఆర్థిక సహాయంతో సబ్ రిజిస్టర్ ఆఫీస్ సమీపంలో శ్రీ భీమవరపు రామారావు ఏర్పాటు చేసుకున్న శ్రీ సాయిరాం టీ స్టాల్ ను సోమవారం మదిర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు శ్రీ వేమవరపు వెంకటేశ్వర శర్మ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అందించే వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందటం చాలా సంతోషమని, బ్రాహ్మణ పరిషత్ ని ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ కి, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా లబ్ధిదారులకే లబ్ధి చేకూరా విధంగా పథకాలను రూపొందించిన పరిషత్ చైర్మన్ శ్రీ కె.వి.రమణాచారి కి ముఖ్యకారణర్వాహణాధికారి రఘురాం శర్మ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామారావు వ్యాపారం అభివృద్ధి చెందాలని శర్మ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గడ్డమణుగు శ్రీనివాసరావు , అవధానాల లక్ష్మీ సుబ్రహ్మణ్య శాస్త్రి , గండూరి శ్రీనివాసరావు, మాదిరాజు దుర్గాప్రసాద్ , డివిఆర్ నాగేశ్వరరావు , గడ్డమణుగు రామభద్రం , గడ్డమణుగు సుప్రియ,జక్కేపల్లి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరను తగ్గించాలి



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 6ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీం పట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచి కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరలు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోవటంతో ప్రజలు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు గత కేంద్ర ప్రభుత్వ కాంగ్రెస్ పార్టీ పాలనలో 500వందల రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలన లో750 రూపాయ లు పెరిగి గ్యాస్ సిలిండర్ ధర 1250 చేరు కోవటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వం వైయస్ రాజశేఖర రెడ్డి పాలనలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర100 రూపాయలు పెంచితే ప్రజలకు విపరీతంగా భారం పడుతుంది అని ఆలోచన చేసిన వైయస్ రాజశేఖర రెడ్డి పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర 50 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని నిర్ణయం తీసుకొని ప్రజలను ఆదుకున్న గొప్ప ముఖ్యమంత్రి స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి కానీ తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నేరుగా ముఖ్యమంత్రి హెూదాలో ఢిల్లీకి వెళ్లి గ్యాస్ ధరలపై ప్రధానమంత్రి ని నిల దీయకుండా తెలంగాణ రాష్ట్రం లో తామే అధికారంలో ఉండి వంట గ్యాస్ ధరల పై కేంద్ర ప్రభుత్వం పై రోడ్ల పైకి వచ్చి ఆందోళన చేయటం చాలా విడ్డురంగా ఉంది అన్నారు తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన చేస్తున్న బిఆర్ స్ నాయకులు మంత్రులే కేంద్ర ప్రభుత్వం పై పోరాటం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలుఎలా తీర్చుతుందో అర్థం కావటం లేదు అన్నారు కేంద్ర పరిధిలో ఏదైనా సమస్యలు ఉంటే తెలంగాణ రాష్టానికి చెందిన పార్లమెంట్ సభ్యులు ఉన్నారు ఢిల్లీ వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి కానీ ప్రతి పక్ష పార్టీల లాగా అధికారంలో ఉన్న మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యే లు ఆందోళనలు చేయటం సిగ్గు చేటు అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల పైన ఇతర సమస్య పై అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై పోరాటం చేస్తే ఎక్కడి నాయకులను అక్కడే బలవంతంగా అరెస్ట్ లు చేయించే ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పార్టీ వాళ్ళు ఆందోళన చేస్తే ఎలాంటి అరెస్ట్ లు ఉండవా ఇదేనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలన తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రజలలో చెలగాటం అడోద్దు వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్. చేస్తున్నాము పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వ ని డిమాండ్ చేసున్నము కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు తగ్గించకుంటే పెంచిన వంట గ్యాస్ ధర తెలంగాణ రాష్ట్రం ప్రజల పై భారం పడకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలపై పోరాటం చేస్తాం రాబోయే ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వనికి ప్రజలు బుద్ధి చెప్పటం కాయం అన్నారు.

## టీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా దేవునూరి రవీందర్



శంకరపట్నం మార్చి 06 ప్రజాపాలన రిపోర్టర్:కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న దేవునూరి రవీందర్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శిగా నియమించినట్లు టీ డబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు జరిగిన టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశము జరిగింది. జిల్లా కమిటీ తీర్మానం మేరకు రవీందర్ ని నియమించినట్లు బాబురావు తెలిపారు. ఈ నియామకం ఈరోజునుండి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. తనను నియమించినందుకు టీ డబ్ల్యూ జేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాపూరావుకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పోరాడుతానని ఆయన తెలిపారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ జాడి గంగాధర్



జన్నారం, మార్చ్ 06, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ టైగర్ జోన్ తల్లపేట్ అటవీ రేంజ్ పరిధిలోని అడవిలో ఉపాధి హామీ పనులను మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ ప్రారంభించారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కుంటలను తవ్వే పనులను కల్పించామన్నారు. పనులు జరిగే సమీపంలో ఉపాధి హామీ కూలీలకు ఇబ్బంది లేకుండా తగిన సౌకర్యాలు కల్పించమన్నారు. ఉపాధి హామీ కూలీల పనులు జరిగిన వెంటనే వారి డబ్బులను అకౌంట్లో వేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, ఇతరులు పాల్గొన్నారు.

## జన్నారం చెరువులను కాపాడండి



జన్నారం, మార్చి 06, ప్రజాపాలన:జన్నారం చెరువులను కాపాడాలని, అన్యాక్రాంతం అయిన చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకోవాలి గంగపుత్ర సంఘం మండల అధ్యక్షుడు కల్లేడ నర్సయ్య డిమాండ్ చేశారు. చెరువు భూమి కబ్జా కు గురైదనే ఆరోపణలు నేపథ్యంలో మండలంలోని తపాల్ పూర్ గ్రామం పరిధిలోని సంగరాయిపేట చేపలు చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరుల తో మాట్లాడారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చాలా గ్రామాల్లో చెరువు శిఖం భూములు కబ్జాకు గురైతున్నవని దీనివల్ల చేపలు పట్టుకు జీవించే గంగపుత్రులకు ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. అలాగే వందల ఎకరాల కు సాగునీటి ని అందించే చెరువు లు అస్థిత్వాన్ని కోల్పోయి చిన్న చిన్న కుంటలు గా మారాయని అన్నారు. రైతులకు కూడా తీవ్ర నష్టాలు ఎదురుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని అన్ని చెరువులు, కుంటలను పూర్తిగా సర్వే చేయించి హద్దులు గుర్తించి, కంచెలు వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనియెడల పెద్దఎత్తున గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శాఖపురం రాజన్న, ముఖ్య సలహాదారులు ఏరుగట్ల మల్లయ్య, కల్లేడ భూమయ్య, పళ్ళికొండ రాజన్న, కల్లేడ నరేష్, శాఖపురం ప్రసాద్, శాఖపురం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు హాజరు యాప్ ద్వారా చెల్లించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఈ మాసం జీతభత్యాలు అటెండెన్స్ యాప్ ఆధారంగా అందించాలని డి డి ఓ లకు కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖ మినహా అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా అటెండెన్స్ యాప్ ఆధారంగా ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించాలని సూచించారు. కార్యాలయానికి ఆలస్యంగా వచ్చేవారు, సమయాని కంటే ముందుగానే వెళ్ళిపోయే వారిపై దృష్టి సారించి తగు చర్యలు పట్టాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర కొంత మంది కార్యాలయ సిబ్బంది సాంకేతిక సమస్యల వల్ల ఏమైనా సమస్యలు ఉంటే వాటిపై కూడా దృష్టి సారించి వాస్తవంగా ఉన్న సమస్యలను పరిశీలించాలన్నారు. కార్యాలయాలలో సిబ్బంది అందరూ పారదర్శకంగా పని చేయాలనే ఉద్దేశంతో అటెండెన్స్ యాప్ ను ప్రవేశపెట్టడం జరిగిందని ఎవరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం కాదని కలెక్టర్ అన్నారు. జిల్లాకు చెడ్డ పేరు రాకుండా అధికారులందరూ కలిసి టీం వర్క్ గా పని చేయాలని కోరారు. కార్యాలయాలలో అటెండర్లుకు గతంలో లాగా పెద్ద పనులు లేవని, వారి సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని కార్యాలయ పరిశుభ్రతతో పాటు సెలవు దినాలలో టర్న్ డ్యూటీలు వేయాలని అన్నారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని కార్యాలయాలలో పరిశుభ్రత పనులు చేపట్టి కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పాఠశాలలు వసతి గృహాలలో పరిసరాలు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఫెన్సింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయని, అట్టి వాటిని గుర్తించి ప్రమాదాలు జరగకుండా ఫెన్సింగ్ చేయాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు తగలబెట్టడం జరుగుతుందని, ఇలాంటి సమస్యలు తిరిగి తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రత్యేక తరగతుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఈనెల 13న ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు ఉన్నందున సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మార్చ్ 15 వరకు అన్ని గ్రామాలలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులందరూ నిబద్ధతలతో పనిచేసి ప్రభుత్వానికి, జిల్లాకు మంచి పేరు వచ్చేలా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**20వ రోజు చేరుకున్న గుడిసె వాసుల ధర్నా**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే రామస్వామి**



చేవెళ్ల మార్చ్06, (ప్రజాపాలన):రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో పేద ప్రజలు గత 20 రోజులుగా సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం మండు ఎండలో పోరాడుతుంటే ప్రభుత్వం లో కదలిక లేకపోవడం బాధాకరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే రామస్వామి అన్నారు.గుడిసెల వాసులతో ఆయన సమావేశం అయ్యారు ప్రభుత్వాన్ని నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ఎన్నికల ముందు తీపి తీపి మాటలు చెప్పి మాయ చేసి ప్రజలతో ఓట్లు వేయించుకొని గెలిచిన ప్రజాప్రతినిధులు పేదల అభివృద్ధి మరిచి దగా కోర్ల కోసం పనిచేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తే సిపిఐ ఈ భూ పోరాటం చేయాల్సిన అవసరం లేకపోఏదని ఆయన తెలిపారు.ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి పేదలకు ఇండ్ల స్థలాలు వచ్చేవరకు భూ పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా పేదల పట్ల సానుభూతితో ఆలోచన చేసి తక్షణమే గుడిసెలు వేసుకున్న పేదవాళ్లకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.ఒకవేళ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే సిపిఐ ఆధ్వర్యంలో జరిగే సమరశీల మిలిటెంట్ పోరాటాల ద్వారా ఎదురయ్యే ప్రతి సమస్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు లింగం మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాధవి మంజుల సుధాకర్ గౌడ్, జై అంజయ్య మార్బుల్ మల్లేష్ శివ తదితరులు పాల్గొన్నారు .

## మిలీనియం పాఠశాలలో ఘనంగా ఫ్రూట్ ఫెస్టివల్ కార్యక్రమం




మధిర మార్చి 6 ప్రజా పాలన ప్రతినిధి: మధిర పట్టణంలోని మిలీనియం టాలెంట్ స్కూల్ నందు సోమవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాధినేని రాజేశ్వరి ఆధ్వర్యంలో ఫ్రూట్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధిర మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థినీ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం చాలా బాగుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇల్లందులపాడు గ్రామం నందు ఉచిత "పశు గర్భకోశ వైద్య శిబిరం" విజయవంతం



మధిర, మార్చి 6 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలో ఇల్లందులపాడు గ్రామం నందు, శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వైద్య (ఫెర్టిలిటీ) చికిత్స శిబిరం నిర్వహించినారు. ఈ శిబిరంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీమతి ఉమా కుమారి గారి సమక్షంలో ఎదకురాని పడ్డలు, చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులు, తిరిగి పొర్లే పశువులకు, చికిత్సలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్, క్యాల్షియం టానికులు అందజేసినారు.
ఈ పశు వైద్య శిబిరంలో పశుపోషకులను ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ, గర్భకోశ వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో చూడి పశువుల పట్ల ఎండ తీవ్రత నుండి సంరక్షణ, పెంపకం మీద తీసుకోవాల్సిన మెలకువలు, బలవర్ధకమైన పశు గ్రాసాల ప్రాముఖ్యతను గురించి వివరించనైనది. ఈ వైద్య శిబిరంలో సత్యసాయి సేవా సమితి జిల్లా ఆర్థిక సహకారంతో సభ్యులు కోనా మోహన్ రావు, కన్వీనర్ మురళీకృష్ణ, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ లక్ష్మణరావు, గోపాల మిత్రులు, సురేష్ వల రాజు, వెంకటకృష్ణ, పశుపోషకులు సూర్యదేవర కృష్ణయ్య తాళ్లూరిసత్యనారాయణరాజారావుఖమ్మంపాడుప్రసాదు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 322 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖలు పరిష్కారించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాలలోని తహసిల్దార్ కార్యాలయాలలో అలాగే మున్సిపల్ కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రేయిని కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గోన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 6ప్రజాపాలన ప్రతినిది: మహిళాదినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం మంగళ్ పల్లి శుభం కన్వెన్షన్ హాల్లో 1983-1984 పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లయన్ కె.వి.రమేష్ రాజు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శాలువాలతో మహిళలను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అందరూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నందారెడ్డి, నంద కుమార్, చండీశ్వర్,సంజీవ, నాగభూషణం,బద్రప్ప, విజయ ప్రతాప్ లు పాల్గొన్నారు.

## పొంగులేటి బాటలోనే మా ప్రయాణం..

**అన్నారుగూడెం ఎంపీటీసీ గోవిందు విజయమ్మ**



తల్లాడ, మార్చి 6 (ప్రజా పాలన న్యూస్): ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటే తమ రాజకీయ ప్రయాణం ఉంటుందని తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామ ఎంపీటీసీ గోవిందు విజయమ్మ, శ్రీనివాసరావు దంపతులు పేర్కొన్నారు. సోమవారం కల్లూరు మండలంలోని నారాయణపురం పొంగులేటి స్వగ్రామంలో ఆయనను కలిసి వారు తాము మీ వెంటే ఉంటామని అభయమిచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి వారిని శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిషెట్టి వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హెూలీ పండగ విశిష్టత ఏంటి..? ఎలా జరుపుకుంటారు..?




బోనకల్, మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి :దేశమంతట అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో హెూలీ పండుగ ఒకటి.తెలుగు నెలల్లో చివరిది ఫాల్గుణ మాసం. హెూలీ పర్వదినం ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజున జరుపుకుంటారు. చతుర్దశి నాడు కాముని దహనం జరిపి మరుసటిరోజు పాల్గుణ పౌర్ణమి రోజు హెూలీ పండుగను జరుపుకుంటారు. భారతదేశంలోనే కాకుండా వివిధ దేశాల్లో కూడా వైభవంగా జరుపుకుంటారు. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను 'వసంతోత్సవం' పేరిట జరుపుకునేవారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో హెూలీ ఒకటి హెూలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనది అని అర్థం. హిరణ్య కశ్యపుని సోదరి హెూలిక ప్రహ్లాదుని చంపబోయి తాను దహనమవుతుంది. ఆ రాక్షసి చనిపోయిన రోజును పురస్కరించుకుని హెూలీ పండుగను నిర్వహిస్తారని కొందరంటారు. ఇంకొందరు ఫాల్గుణ పౌర్ణమి నాడు కాముని పున్నమి పేరిట సంబరాలు జరుపుకుంటారు. సతీవియోగంతో విరాగిలో మారిన పరమేశ్వరుడికి హిమవంతుని కుమార్తెగా జన్మించిన పార్వతితో వివాహం జరిపించాలని దేవతలు నిర్ణయించారు. దీంతో పార్వతీదేవిపై పరమశివుడి దృష్టి నిలిచేలా చేయమని మన్మథుని సాయం తీసుకున్నారు. మన్మథుడు శివుడిపైకి పూల బాణాన్ని ప్రయోగించి, తపోభంగం కలిగించాడు. తపోభంగంతో తీవ్ర ఆగ్రహావేశాలకు లోనైన శివుడు మూడో కన్ను తెరిచి మన్మథున్ని భస్మం చేస్తాడు. అలా కోరికలు దహింపజేసిన రోజు కావడం వల్ల ఆ రోజు కామదహనం పేరుతో మన్మథుడి బొమ్మను గడ్డితో చేసి తగులబెడతారు. హెూలీ వేడుకలు ప్రవాసభారతీయులు ఉన్న ప్రాంతాలలో హెూలీ పండుగను ఘనంగా జరపుకుంటారు. కారణాలు ఏవైనా రంగుల పండుగ హెూలీ అంటే అందరికి ఎంతో ఉత్సాహం. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా స్నేహితులు, బంధువులతో ఎంతో ఆనందరంగా, ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారు.

## మృతుడి కుటుంబానికి ఎస్కేఆర్ ట్రస్టు ఆర్థిక సాయం

### ఎస్కెఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సనగారి కొండల్ రెడ్డి



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : మర్పల్లి మండల పరిధిలోని కలో?ద గ్రామంలో చెవుల శ్రీనివాస్ ఆదివారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. అట్టి విషయం స్థానిక ఎంపిటిసి పసుల శ్రీవిద్య వెంకటేష్ ముదిరాజ్ ద్వారా తెలుసుకున్న ఎస్కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి, చెవుల శ్రీనివాస్ అంత్యక్రియలకు 5000 రూపాయలు ఆర్థిక సహకారం అందజేశారు. గ్రామస్తులతో కలిసి మృతుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ పంపిన 5000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ పి శ్రీనివాస్ సి,సుదర్శన్ , సి రత్నం ,వై యాదగిరి, ఎస్ వెంకటేష్ ,పి ఇబ్రహీం ,సిహెచ్ రాములు ,డి శ్రీనివాస్ ,సి బలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహణ



లక్షెట్టి పేట, మార్చి 06, ప్రజాపాలన:లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది. సుమారు 300 మంది విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్స్ తయారుచేసి ప్రదర్శన నిర్వహించడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొని విద్యార్థులు చేసినటువంటి సైన్స్ ఆవిష్కరణలను ని చూసి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిందం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెరుగుతుంది. విద్యార్థులు చాలా రకాల నూతన ఆవిష్కరణలను తయారు చేయడం జరిగింది. మంచి ప్రదర్శన ఇచ్చినటువంటి విద్యార్థులకు బహుమతులు కూడా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గౌరవాధ్యక్షులు రమేష్ చంద్ జైన్ పాఠశాల కరస్పాండెంట్ అక్కల శ్రీనివాస్, డైరెక్టర్లు పెట్టం తిరుపతి, ఎంబడి రమేష్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంధత్వ రహిత సమాజమే తెలంగాణ ప్రభుత్వలక్ష్యం



మధిర ,మార్చి 6 ప్రజా పాలన ప్రతినిధి: సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున పిహెచ్సి దెందుకూరు వైద్యులు డా. పృథ్వీ మరియు కంటి వెలుగు డా. సునీత పారా మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో మండలం పరిధిలో మహాదేవపురం జిపి హెల్త్ సెంటర్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ కంటి వెలుగు ప్రోగ్రాం ను మొదటగా గ్రామ ప్రథమ పౌరురాలు నరకూటి బంగారమ్మ తులసీరామ్ ఎంపీపీ మొండెం లలిత వెంకయ్య, ఎంపీడీఓ విజయ భాస్కర్ రెడ్డి సమక్షంలో మరియమ్మ అనే మహిళకు వీరి చేతులు మీదుగా కంటి అద్దాలను అందజేసి క్యాంపు ప్రారంభించినారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ రహిత సమాజమే తెలంగాణ ప్రభుత్వం ప్రధానలక్ష్యం అని పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమం పల్లె దవఖానా జిపి కార్యాలయం ప్రక్క ప్రక్కన వున్నవి కనుక కంటి వెలుగుకు 5 కౌంటర్ లు కావాలి కనుక ఈ రెండు కార్యలయాలు ఉపయోగిస్తున్నారు. ఈ క్యాంపు వారం రోజులు గ్రామములో కొనసాగుతున్నది అని ఉదయం 9 గంటలనుండి సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది అని 18 సంవత్సరాలు పై బడిన వారు తమ ఆధార్ కార్డు వెంట తెచ్చుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు అన్నారు.

# మా పంట పొలాలకు నీరు అందించండి

### సర్పంచ్ ఆధ్వర్యంలో డి ఈ నీ సాగర కాలవపై నిర్బంధించిన రైతులు




బోనకల్, మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి: మా పంట పొలాలకు నీరు అందించండి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెండు గంటలు పాటు సాగర్ కాలువపై నీటిపారుదల శాఖ డి.ఈ ని సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ ఆధ్వర్యంలో రైతులు నిర్బంధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు పరిధిలో మొక్కజొన్న పంట ఎండిపోతున్న అధికారులు స్పందించడం లేదని అన్నారు. సాగర్ ఎడమ కాలువ కు 11000 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని అందులో 7000 క్యూసెక్కుల నీరు అందించాల్సిన బాధ్యత ఉందని అలా కాకుండా కేవలం రెండున్నర వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడం వల్ల బ్రాంచి కాలువలు తూములకు నీరు అందడం లేదని, ఆరకోరగా నీరు వచ్చిన జిల్లా అధికారులు వారబంది విధానం ద్వారా సాగర్ జలాలు సరఫరా చేయడం వల్ల ఆయకట్టు చివర భూములకు సాగునీరు అందక పంటలు మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు . సాగర్ ఆయకట్టు కు విడుదల చేయాల్సిన ఏడు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని వారబంది విధానం ఎత్తివేసి సాగర్ జలాలు మార్చి చివరి వరకు నిరంతరాయంగా సరఫరా చేయాలి అని డిమాండ్ చేశారు. సాగునీరు పూర్తి స్థాయిలో నిలుపుదల చేయడం సరికాదని అన్నారు.ఎండలు తీవ్రత ఎక్కువ అవుతున్న సందర్భంలో సాగు నీరు అవసరం పెరుగుతున్నది అని మొక్కజొన్న పంట కంకి గింజపోసుకున్నె దశలో ఉంది అని నాలుగు, ఐదు రోజుల నీరు అందకపోతే మండలంలో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బ తింటుంది అని అన్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడం, రైతులకు సాగర్ నీరు అందక నష్టపోతున్నారని సర్పంచ్ తో రైతులు రెండు గంటలు పాటు నిరసన కొనసాగించి డి ఈ నీసాగర్ కాల్వ పై నిర్బంధించారు. చివరి భూములకు సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా అరికట్టాలి

### మధిర తహసీల్దార్ కి మెమోరాండం ఇచ్చిన, బీజేపీ నాయకులు



మధిర ,మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి:మధిర లో ప్రతి రోజు వందలాది, ఇసుక లారీలు, అధిక లోడ్ తో మధిర ఆర్ అండ్ బి రోడ్లను ధ్వంసం చస్తూ అధిక వేగం తో లారీలను నడుపుతు,ప్రజలను భయబ్రాంతులకు గురించేస్తు,పక్క రాష్ట్ర నుండి, మధిర మీదిగా వెళుతున్న లారీల పై చెర్యలు తీసుకోవాలని,అలాగే, మధిర వైరా నది నుండి, ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ లు తో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నవారిపై, చర్యలు తీసుకోవలన్నీ, మధిర తహసీల్దార్ కి సోమవారం మెమోరాండం ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమం లో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్, ఏలూరి నాగేశ్వరావు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి, పెరుమాళ్ళపల్లి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి, చిలువేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి,రామిశెట్టి నాగేశ్వరావు, పట్టణ అధ్యక్షులు, పాపట్ల రమేష్,జిల్లా నాయకులు, మర్శకట్ల స్వర్ణకర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి, కాసినా నాగభూషణం,ఉపాధ్యక్షులు, పెరుమాళ్ళపల్లి మోహనరావు, ప్రధాన కార్యదర్శి, బియ్యవరపు రామకృష్ణ, పట్టణ యువమోర్చ అధ్యక్షులు, కుక్కల రాము, తదితరులు పాల్గొన్నారు.

## భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు జెండా ఆవిష్కరణ



శంకరపట్నం మార్చి05 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా విభాగం ఆదివారం మండల కేంద్రంలో ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లమ్మ మాట్లాడుతూ జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేసి మహిళా సాధికారత కోసం పాటుపడుతున్నట్లు తెలియజేశారు. ప్రతి మహిళ అభ్యున్నతికి పాటుపడుతూ మహిళలను సంఘటితం చేస్తూ మహిళా సమస్యలపై పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ప్రీతి మృతికి సంతాపం తెలియజేస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులను, హత్యలను, అత్యాచారాలు, అన్యాయాలను మహిళలందరూ కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర కార్యదర్శి కొట్టే అంజలి, సభ్యులు ములుగు లక్ష్మి, మాచర్ల పద్మ, మాచర్ల స్వరూప, పిట్టల రాజేశ్వరి, పిట్టల రమ, సుంకరి తిరుమల చాడ తిరుమల, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సదానందం, దొమ్మడి వెంకటస్వామి, భూక్య పవన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలకు వచ్చే విద్యా సంవత్సరం అనుమతి రద్దు: జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి



వికారాబాద్ బ్యూరో 06 మార్చి ప్రజాపాలన : రీజినల్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లి, తాండూర్ మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ రెండు ప్రాంతాలలో గల శ్రీ చైతన్య పాఠశాల ప్రస్తుత విద్యా సంవత్సరం అనగా 2022 – 23 చివరి పని దినం వరకు మాత్రమే నడపబడును. వచ్చే విద్యా సంవత్సరం అనగా 2023 – 24 గాను పైన పేర్కొన్న శ్రీ చైతన్య పాఠశాలలు కొనసాగించుటకు అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయని జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇట్టి విషయాన్ని గమనించగలరని ఆమె తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




మధిర మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర నందు తెలుగు విభాగం మరియు లియో క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. మరియు మహిళా ఉద్యోగులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎల్ ఎన్ శాస్త్రి గారు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ ఇందిర, ఎస్.కె అబ్రోజ్, పి లక్ష్మీనారాయణ, డాక్టర్ కె వీరన్న, ఆఫీస్ సిబ్బంది%ంN%. అష్ఫల్, పుణ్యవతి, నాగలక్ష్మి, హరినాథ్ బాబు మొదలైన వారు పాల్గొన్నారు.

## పేదవారి జీవితాల్లో వెలుగులు నింపడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యం: జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు



మధిర మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ కంటి వెలుగు తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా రాష్ట్రంలోని సంపూర్ణ అందత్వ నిర్మూలన లో భాగంగా మండల పరిధిలోని నిదానపురం గ్రామపంచాయతీ నందు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ప్రారంభించారు. ఈ అవకాశాన్ని గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ మెండం లతా వెంకయ్య సర్పంచి భాధాకృష్ణారెడ్డి, సెక్రెటరీ హరి, వెంకటేష్, టిఆర్ఎస్ నాయకులు కరి వేద వెంకటేశ్వరరావు, కరివేద సుధాకర్ రావు, ఏఎంసి మాజీ చైర్మన్ చితారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మరియమ్మ , మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఆప్తో మెటీస్టర్ పులిపాటి వినయ్, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, నాయకులు పాల్గొన్నారు.

## సాగర్ నీటి సమస్యలపై జడ్పీ చైర్మన్ కు వివరించిన మండల నాయకులు



బోనకల్ మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి: బీఆర్ఎస్ మధిర పార్టీ కార్యాలయం లో బోనకల్లు మండలం నారాయణపురం గ్రామ రెవిన్యూ పరిధిలోని రైతులు సొసైటీ వైస్ చైర్మన్ కరివేద సుధాకర్ రావు, కాకాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగర్ కాలువ నీటి సమస్యలపై జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ని కలిసి వారి సమస్యలను వివరించడం జరిగింది. వెంటనే స్పందించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు నీటిపారుదల శాఖ ఎస్ ఈ తో మాట్లాడి మూడు రోజుల్లో చివరి భూముల వరకు నీళ్లు ఇప్పించి మొక్కజొన్న పంటలు ఎండిపోకుండా రైతులకు న్యాయం జరిగేలా ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భట్టి విక్రమార్క దంపతులు



మధిర, మార్చి 6 ప్రజాపాలన ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క దంపతులు సోమవారం ప్రత్యేక అభిషేకాలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం జరగబోయే కళ్యాణ మహెూత్సవ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రములు. ముత్యాల తలంబ్రాలు. మంగళ సూత్రాలను స్వామివారికి సమర్పించినారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ వినయ్ దేవాలయ ఈవో పూర్ణకుంభంతో స్వాగతం పలికినారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ,మధిర మాజీ మార్కెట్ చైర్మన్ రంగా హనుమంతరావు, మధిర మున్సిపల్ కౌన్సిలర్ కోన దని కుమార్ సుచరిత, వైరా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి,పిసిసి మెంబర్ రాందాస్ నాయక్ ,ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు వనమా సూరి ,మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు దుంప వెంకటేశ్వర రెడ్డి,గడ్డం అనిత. తదితరులు పాల్గొని పూజలు నిర్వహించినారు.



# అన్నగారులాగే ఆ సీనియర్ నటి!



నట సార్వభౌముడు..అన్నగారు ఎన్టీఆర్ ఎంత గొప్ప నాన్ వెజ్ ప్రియుడో చెప్పాల్సిన పనిలేదు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుంచి నైట్ డిన్నర్ వరకూ మాంమాసాహారం తప్పనిసరి. చిల్లి గారి-చికెన్ కాంబినేషన్ ఎంతో మంది అప్పటి స్టార్లకు రుచి చూపించింది ఆయనే. అందుకే ఎన్టీఆర్ గురించి ఆయన సహచరులు ఎవరు చెప్పినా? గొప్ప నాన్ వెజ్ ప్రియుడిగా చెబుతుంటారు. అయితే భక్తి నేపథ్యంగల సినిమాలు చేస్తే మాత్రం మాంంసం వాసన కూడా దగ్గరకు రానివ్వరుట.అలాంటి సినిమాలో నటిస్తున్నప్పుడు నాన్ వెజ్ వంటకాలకు దూరంగా ఉంటారుట. ఈ విషయంలో అన్నగారిని చూసి ఎంతో నేర్చుకున్నానని అలనాటి నటి కె.ఆర్ విజయ తెలిపారు. ఆయన దేవుడు పాత్రలు చేసేటప్పుడు ఎంతో నియమ నిష్టలతో ఉంటారు. సెట్ లో ఆయన్ని అలా చూసి నేను ఎంతో నేర్చుకున్నాను. షూటింగుకు ముందు అమ్మవారి గుడికి వెళ్లి ఆ తల్లి ఆశీస్సులు తీసుకునేదానిని.ఆ షూటింగు పూర్తయ్యేవరకూ శాకాహారిగా ఉండేదాన్ని. నేను ఎక్కడికి వెళ్లినా అమ్మవారిగా భావించి నన్ను గౌరవిస్తూ ఉండేవారు' అని అన్నారు. ఇంకా ఆమె మాట్లాడుతూ..నటన అంటే మా నాన్నగారికి ఎంతో ఇష్టం.అందువలన చిన్నప్పటి నుంచి నాతో నాటకాలు .. డ్రామాలు వేయిస్తూ ఉండేవారు. అందువలనే 3వ తరగతికి మించి చదువు సాగలేదు. చదువుకున్న కళారంగం వైపు అప్పటి నుంచి మరింత ఆసక్తి చూపించేదాన్ని.అలా మొదలైన ప్రయాణం ఎన్నో సినిమాల వరకూ కొనసాగింది. నటి అవ్వడం అన్నది నిజంగా ఎంతో గొప్ప విషయం. నటులకు మాత్రమే ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. వివాహమైన తరువాత కూడా నటించమని మా వారే నన్ను ప్రోత్సహించారు. అందువల్లనే నేను ఇన్ని సినిమాలు చేయగలిగాను. మా అమ్మాయి మా బిజినెస్ వ్యవహారాలు చూసుకుంటూ ఉంటుంది .అల్లుడు 'అపోలో'లో డాక్టర్. అప్పట్లో నాతో పాటు నటించిన శారద .. కాంచన .. రాజశ్రీ .. షావుకారు జానకి అంతా ఇప్పటికీ టచ్ లో ఉంటాం. ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటాం' అని అన్నారు.

## రవితేజ "రావణాసుర" టీజర్ పై డైరెక్టర్ బాబీ కామెంట్స్!



మాస్ మహారాజా రవితేజ ధమాకా చిత్రం లాంటి బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత అదే దూకుడు కొనసాగిస్తున్నారు. రవితేజ టైటిల్ రోల్ లో డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం రావణాసుర. ఈ చిత్రం కి సంబంధించిన టీజర్ ను నేడు చిత్ర యూనిట్ విడుదల చేయడం జరిగింది. మాస్ మహారాజా డిఫెరెంట్ షేడ్స్ తో ఉన్న ఈ టీజర్ ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ టీజర్ ను చూసిన డైరెక్టర్ బాబీ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.రావణాసుర టీజర్ సూపర్ అంటూ చెప్పుకొచ్చారు. మాస్ మహారాజా రవితేజ మల్టీ షేడెడ్ క్యారెక్టర్ లో సూపర్ గా చేశారు. బిగ్ స్క్రీన్ పై థ్రిల్ ను ఎంజాయ్ చేయడానికి వెయిట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ సుధీర్ వర్మ కి, చిత్ర యూనిట్ కి బెస్ట్ విషెస్ తెలిపారు. అను ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా, మేఘా ఆకాష్, దివ్యాంశ కౌశిక్ మరియు పూజిత పొన్నాడ లు ఈ చిత్రం లో లేడీ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు.రావు రమేష్, మురళీ శర్మ, సంపత్ రాజ్, నితిన్ మెహతా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ మరియు %=% టీమ్‌వర్క్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ మరియు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా ఏప్రిల్ 7, 2023 న గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# భార్యకు ప్రేమతో.. బన్నీ స్పెషల్ పిక్!





ఈ రోజు అల్లు అర్జున్ ఆయన భార్య స్నేహారెడ్డి వివాహం చేసుకున్న రోజు. ప్రతిరోజు షూటింగ్స్ లో బిజీగా ఉండే అల్లు అర్జున్ ఈ రోజు తన భార్యకు హ్యాపీ యానివర్సరీ అంటూ విషెస్ చెబుతూ ఒక ఫోటో షేర్ చేశారు. ఈ ఫోటో షేర్ చేయడంతో వెంటనే ఒక్కసారిగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీంతో అన్నా వదినలకు హ్యాపీ మ్యారేజ్ వెడ్డింగ్ యానివర్సరీ అంటూ అల్లు అర్జున్ అభిమానులు సైతం పెద్ద ఎత్తున వారికి శుభాకాంక్షలు చెబుతున్న పరిస్థితి కనిపిస్తోంది.అంతేకాక వీరి వెడ్డింగ్ యానివర్సరీకి సంబంధించి అనేక ఫోటోలు షేర్ చేస్తూ సోషల్ మీడియాలోనే శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వాస్తవానికి అల్లు అర్జున్ భార్య సినిమా రంగానికి దూరంగానే ఉంటారు.తన భర్త పాన్ ఇండియా స్టార్ అయినా సరే ఆమె పెద్దగా సినిమా విషయాలలో వేలుపెట్టరు. తమ పనేదో తాను చేసుకుంటూ ఉంటారు కానీ ఈమధ్య ఆయనే సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలు ఫోటోషూట్లు ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూ వస్తున్నాయి.ఆమె తన భర్తకు సంబంధించిన అప్డేట్స్ ఇవ్వడమే కాదు. తన కుమార్తె అర్హ కుమారుడు అయాన్ కు సంబంధించిన ఫోటోలను కూడా సోషల్ మీడియాలో షేర్ చేస్తూ రావడంతో ఆమెకు కూడా పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో మంచి క్రేజ్ అయితే ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఆమె ఎప్పటికప్పుడు తన భర్తకు సంబంధించి అలాగే తన కుమారుడు కుమార్తెకు సంబంధించిన అప్డేట్స్ ఇవ్వడానికి ఆసక్తి చూపిస్తూ వస్తున్నారు.కొన్నాళ్ల క్రితం అల్లు అర్జున్ స్నేహ రెడ్డి ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. తెలంగాణలోని నల్గొండ ప్రాంతానికి చెందిన స్నేహ రెడ్డి తండ్రి ఒక విద్యావేత్త. ఆయనకు అనేక కాలేజీలు సైతం ఉన్నాయి. గతంలో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నించిన ఆయన టికెట్ దొరకపోవడంతో సైలెంట్ అయ్యారు. ఈ సారి అల్లుడి మద్దతు కూడా ఉంటుందని కచ్చితంగా టికెట్ దక్కించుకుని పోటీ చేసి తీరుతానని ఆయన అంటున్నారు.

# మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ కొట్టేసిన బలగం



గత వారంలో థియేటర్ల ద్వారా ప్రేక్షకులు ముందుకు వచ్చిన అన్ని సినిమాలలో బలగం సినిమా క్లీన్ హిట్ గా నిలిచింది. కమెడియన్ వేణు దర్శకుడిగా మారి ఈ సినిమా తెరకెక్కించారు. జబర్దస్త్ ద్వారా మంచి ఫేమస్ అయిన వేణు కొన్నాళ్లుగా జబర్దస్త్ సినిమాలు అన్నింటికి దూరమై ఈ సినిమా మీదనే వర్క్ చేశారు. దిల్ రాజు కుమార్తె హర్షిత రెడ్డి హర్షిత్ రెడ్డి నిర్మాతలుగా ఈ సినిమా తెరకెక్కింది.దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ తో మొట్టమొదటి సినిమాగా ఈ సినిమా వచ్చింది. దిల్ రాజు బ్యానర్ ఉండడంతో సినిమాకు బాగా ప్లస్ అయింది. ప్రియదర్శి కావ్య కళ్యాణ్ రామ్ రచ్చ రవి వేణు వంటి వారు కీలక పాత్రలలో నటించిన ఈ సినిమా మొదటి ఆట నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.చిన్న సినిమాగా రూపొందిన ఈ సినిమా నిజాం సహ ఆంధ్రప్రదేశ్ లో సైతం డీసెంట్ కలెక్షన్స్ వస్తున్నాయి. సినిమా బడ్జెట్ చాలా తక్కువ కావడంతో ఇప్పటికే దాదాపుగా ఆ బడ్జెట్ అంతా రికవరీ చేసినట్లుగా చెబుతున్నారు. మొదటి వీకెండ్ అంటే మూడు రోజుల్లోనే ఈ సినిమా దాదాపుగా బడ్జెట్ రికవరీ చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాకి సంబంధించి మొదటి మూడు రోజుల కలెక్షన్స్ విషయానికి వెళ్తే మొదటి రోజు 55 లక్షలు రెండవ రోజు 80 లక్షలు మూడో రోజు కోటి 75 లక్షలు వసూలు చేసింది.తద్వారా మూడు రోజులుగాను మూడు కోట్ల 10 లక్షలు గ్రాస్ కోటి 30 లక్షల షేర్ వసూలు చేసింది. ఇక ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల 15 లక్షల గ్రాస్ కోటి 32 లక్షల షేర్ వసూలు చేసిన ఈ సినిమా మొత్తం బిజినెస్ కోటి 15 లక్షలకు జరిగింది. బ్రేక్ ఈవెన్ కోటి 30 లక్షలుగా నిర్ణయించారు. ఇప్పటికే రెండు లక్షల లాభాలతో ఈ సినిమా హిట్ స్టేటస్ సాధించింది. ఇప్పట్లో శుక్రవారం వరకు మళ్లీ థియేటర్లలో సినిమాలు రావు కాబట్టి మరిన్ని వసూలు లభించే అవకాశం కల్పిస్తోంది.

# శర్వా ఎమోషనల్ నోట్



thank you

20 years of facing the camera and entertaining you all on the silver screen.

What a roller coaster ride of emotions it's been - 20 years of friendships, hardships, highs, lows, smiles, struggles, and I wouldn't have it any other way.

Thank you to all of you who have stood by me through thick and thin and showered me with your unwavering love and support.

These 20 years have transformed my life for the best and made me a better person.

This 'Oke Oka Jeevitham' is dedicated to cinema, which had its 'Sreekaram' 20 years ago. This 20 years of 'Prasthanam' is nothing short of magical. But with this comes a great responsibility. The 'Gamyam' is still far away. I promise to work hard and never take it for granted. So, in short, I will always 'Run Raja Run' to entertain you to the fullest. I am sure it will be possible with all your blessings of 'Shatamanam Bhavati'.

Yours,
Sharwanand

యంగ్ అండ్ వెరీ టాలెంటెడ్ నటుల్లో తప్పకుండా ఉండే పేరు శర్వానంద్. ఈ టాలీవుడ్ యంగ్ హీరో సినిమాల్లోకి వచ్చి సరిగ్గా 20 ఏళ్లు గడిచాయి. 2003 నుండి సినీ ఇండస్ట్రీలో ఉంటున్నాడు శర్వా. ఎన్నో మరపురాని పాత్రల్లో కనిపించాడు. మంచి పాత్ర దొరికితే అందులోకి పరకాయ ప్రవేశం చేసి అందరినీ అలరించే టాలెంట్ శర్వా సొంతం. కెరీర్ తొలి నాళ్ల నుండి తన పంథాను విభిన్నం. భిన్న తరహా పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరిస్తూ అందరి అభిమానాన్ని సంపాదించు కున్నాడు.20 ఏళ్లు సినీ ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ ట్విట్టర్ లో శర్వానంద్ ఎమోషనల్ పోస్టు పెట్టాడు. థ్యాంక్స్ అంటూ ఆ నోట్ లో పేర్కొన్నాడు. " 20 ఏళ్లుగా ఎన్నో పాత్రలు చేస్తూ వెండితెరపై అందర్నీ అలరిస్తున్నాను. భావోద్వేగాలతో నిండిన ఈ ప్రయాణంలో 20 సంవత్సరాల స్నేహం కష్టాలు ఎత్తులు లోతులు చిరునవ్వులు ఎన్నో మరెన్నో. అచంచలమైన ప్రేమ మరియు మద్దతుతో నా ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన మీ అందరికీ ధన్యవాదాలు. ఈ 20 సంవత్సరాలు నా జీవితాన్ని నా వ్యక్తిత్వాన్ని అద్భుతంగా మలిచాయి". "నా ఈ 'ఒకే ఒక జీవితం' సినిమాకి అంకితం. 20 సంవత్సరాల క్రితం 'శ్రీకారం' చుట్టిన ఈ సినీ 'ప్రస్థానం' మరపురానిది మరువలేనిది. ఈ సినీ లోకంలో నా 'గమ్యం' ఎంతో దూరం. మిమ్మల్ని అలరించడం కోసం ప్రతి క్షణం 'రన్ రాజా రన్'లా పరుగులు తీస్తూనే ఉంటాను. కృషి చేస్తూనే ఉంటాను. 'శతమానం భవతి' అంటూ మీరు నాకు ఇచ్చే ఆశీస్సులతో ఇది సాధ్యమవుతుందని నేను నమ్ముతున్నాను." అంటూ పోస్టులో పేర్కొన్నాడు.ప్రస్తుతం శర్వానంద్ శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. దీనికి శర్వా35 అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అంతే కాదండోయ్ ఈరోజు శర్వా పుట్టిన రోజును పురస్కరించుకొని సినిమాకు సంబంధించిన పోస్టర్ ను కూడా విడుదల చేశారు.

## బాలయ్యతో బాలీవుడ్ భామ.. క్యారెక్టర్ అదే !



నందమూరి బాలకృష్ణ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలయికలో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో బాలీవుడ్ భామ నోరా ఫతేహి ను తీసుకోవాలని ఆలోచిస్తున్నారట. ఈ పాత్ర నెగిటివ్ గా ఉంటుందని, ఈ పాత్రకి నోరా ఫతేహి అయితేనే సరైన న్యాయం జరుగుతుందని అనిల్ రావిపూడి భావిస్తున్నాడట. మరి నోరా ఫతేహి – బాలయ్య కలయికలో ఏ రేంజ్ సీన్స్ ఉంటాయో చూడాలి. ఈ సినిమా తెలం గాణ నేపథ్యంలో ఓ భారీ యాక్షన్ మూవీగా రాబోతుంది. పైగా ఈ సినిమాలో బాలయ్య పూర్తిగా తెలంగాణ మాండలికంలో డైలాగ్ లు చెప్పబోతున్నారు.అలాగే బాలయ్య క్యారెక్టర్ వెరీ పవర్ ఫుల్ గా ఉంటుందని, ముఖ్యంగా 60 ఏళ్ల వ్యక్తిగా బాలయ్య గెటప్ అండ్ సెటప్ అదిరిపోతోందని టాక్ నడుస్తోంది. ఇక కథ విషయానికి వస్తే.. ముప్పై ఏళ్ల వయసులో ఆవేశంలో చేసిన గొడవల కారణంగా హీరోకి 14 ఏళ్లు శిక్ష పడుతుందట. అలా జైలు నుంచి అరవై ఏళ్ల వయసులో విడుదలైన హీరో జీవితంలో చోటు చేసుకునే సంఘటనల ఆధారంగా ఈ సినిమా సాగుతుందట. మొత్తానికి అనిల్ – బాలయ్య కలయికలో సినిమా అనగానే ఈ సినిమా పై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి

PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989